Tel Tel - 20684

మన

ప్రజా అక్షరం

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...

TELUGU DAILY NEWS PAPER

తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 238

ఆదివారం నవంబర్ 08 2026 - పేజీలు - 8

PUBLISHED FROM HYDERABAD RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, VIJAYAVADA, VISHAKAPATNAM, TIRUPATHI



ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్

పెట్టుబడులకు ప్రోత్సాహం

ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

హైదరాబాద్, నవంబరు 7 :

హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు (వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో ఆర్థాఫిన్‌టెక్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతమైన మానవ వనరుల తయారీకి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్--2047



విజన్‌లో భాగంగా గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఉద్ఘాటించారు. బ్యాంకింగ్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్లలో ఆర్థాఫిన్‌టెక్ సేవలు అందిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

మేడిగడ్డ వద్ద పాతిపెట్టడమే

వాళ్లకు సరైన శిక్ష

- మేడిగడ్డ తామే కట్టామని గొప్పలు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలు, అది కూలిపోతే మాత్రం బాధ్యత తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి విమర్శించారు.
- పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరు
- కట్టామని చెప్పుకుంటారు
- కూలితే మాత్రం బాధ్యత తీసుకోరు



పాలమూరు :పదేళ్లలో పాలమూరు జిల్లాలో ఏ ప్రాజెక్టును కేసీఆర్ పూర్తి చేయలేదని, పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల బడ్జెట్ చేతికి వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ వరప్రదాయనిగా మారే ప్రాణ హిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టారని, ప్రాజెక్టు పేరు మార్చి, స్థలం మార్చి, అంచనాలు పెంచి కాళేశ్వరం కట్టారని, కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే కట్టారని, అప్పుడే కుప్పకూలిందని విమర్శలు చేశారు. కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో సీఎం పర్యటి చారు. హకీంపేటలో అగ్రి ఎక్స్‌పో స్టాల్లను పరిశీలించారు. రైతుమేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను సీఎం ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మట్లాడుతూ గత ప్రభుత్వంపై నిప్పులు కురిపించారు.ఎల్‌నినో విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు మిగతా 2లో...

భాగ్యనగరంలో నీటి యుద్ధం



- అక్టోబర్‌లోనే 2.2 లక్షల ట్యాంకర్ల బుకింగ్స్.
- గణాంకాలు చెబుతున్న భయానక నిజాలు..

హైదరాబాద్, నవంబరు 7 :

ఆకాశహర్మ్యాలు, గ్లోబల్ ఐటీ కంపెనీలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలతో అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న హైద రాబాద్ మహానగరంలో సరికొత్త సంక్షోభం ముంచు కొస్తోంది. నగరంలో భవనాలు ఎంత వేగంగా పైపైకి లేస్తున్నాయో. అంతే వేగంగా భూగర్భ జలాలు అగాధం లోకి జారిపోతున్నాయి. సాధారణంగా ఎండకాలంలో కనిపించే నీటి ఎద్దడి, ఈసారి మిగతా 2లో...

17 ఏళ్ల నిరీక్షణకు తెర

కూకట్‌పల్లి ప్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

- కూకట్‌పల్లి ప్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
- కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట
- 14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ



హైదరాబాద్, నవంబరు 7 :

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలు దారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ప్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరి ట రిజిస్ట్రేషన్ చేయాలని తెలం గాణ హౌసింగ్ బోర్డును సర్వోన్న త న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లితో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల మిగతా 2లో...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో

దీపావళి వెలుగులు



సిద్దిపేట జిల్లా, నవంబరు 7:

దశాబ్ద కాలంగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలను తమ ప్రభుత్వంలో సాకారం చేస్తున్నామని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో దీపావళి వెలుగులు నింపామని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో 'మన ఇందిరమ్మ ఇళ్ల'ల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల యజమాని పొన్నం కోమల, సమ్మయ్య ముదిరాజ్ కుటుంబానికి బట్టలు పెట్టి, స్వీట్లు తినిపించి, మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దీపావళి సందర్భంగా లబ్ధిదారుడి ఇంట్లో క్రాకర్స్, బాణాసంచా కాల్చి పండుగను చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి సంబరాలు జరుపుతున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. మిగతా 2లో...

'బీజేపీ మన ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా డ్యామేజ్ చేసింది'?

- గత 12 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడ్డాయని సోనియా గాంధీ ఆరోపించారు.
- వ్యవస్థలను పునరుద్ధరించడానికి రాజకీయ పార్టీలు కృషి చేయాలని సోనియా అన్నారు.



హైదరాబాద్: దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు గత 12 ఏళ్లలో తీవ్రంగా దెబ్బతిన్నాయని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆరోపిం చారు. అధికార బీజేపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పి ంచారు. దేశ మౌలిక స్వరూపానికి, ప్రజాస్వామ్యానికి జరి గిన నష్టాన్ని ప్రజలు క్రమంగా గుర్తిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థలను పునరు ద్ధరించడానికి రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సి అభిప్రాయపడ్డారు. మీ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

గత పన్నెండేళ్లలో దేశ మౌలిక స్వరూపం, ప్రజాస్వామ్యం, సంస్థలకు తీవ్ర నష్టం జరిగిందని సోనియా గాంధీ అన్నారు. ఈ పరిణామాలను ప్రజలు ఇప్పుడు అర్థం చేసుకోవడం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, సుపరిపాలనను తిరిగి తీసుకురాగల సామర్థ్యం భారత ఓటర్లకు ఉందని మిగతా 2లో...



విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్ ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా

ఏపీ ప్రభుత్వం

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్'
- 59 దేశాల నుంచి 1250 మందికి పైగా ప్రతినిధుల భాగస్వామ్యం
- ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సమీక్ష
- వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ సహా ఆరు కీలక రంగాలపై ప్రధానంగా చర్చలు
- పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం 400 బీటుబీ సమావేశాలు



విశాఖపట్నం:విశాఖపట్నం నగరం మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరగనుంది. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే థీమ్‌తో నిర్వహించే మిగతా 2లో...

ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి పొంగులేటి

కంపెనీకి అనుచిత లబ్ధి



హైదరాబాద్ : కోడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి పొంగులేటి కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా వేదిక ద్వారా ఆరోపించారు. మంత్రి పొంగులేటి సొంత కంపెనీ టెండర్లలో పాల్గొని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని విమర్శించారు.రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని పేర్కొన్నా రు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న రైతాంగానికి చుక్క నీరు అందకముందే అంచనా వ్యయా న్ని ఐదు రెట్లకు పెంచారని వెల్లడించారు. ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే ప్రాజెక్టుల మిగతా 2లో...

డిండికి నీళ్లు తీసుకురావడం సాధ్యం కాదు



నల్లగొండ: ఏదుల నుంచి డిండికి నీళ్లు తీసుకురావడం అసాధ్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గోదావరి నీళ్లను తీసుకువ స్తేనే నల్లగొండ ప్రాంతం సస్యశ్యా మలం అవుతుందని అభిప్రాయప డ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ పను లు చేపడితే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డ్యామేజ్ అయ్యిందని చెప్పుకొచ్చారు. ఇక, మహబూబ్ నగర్‌కు నీళ్లు ఇవ్వడానికే చాలా సమయం పడుతుందని, నల్లగొండకు నీళ్లు రావడం సాధ్యం కాదని తెలిపారు. ఈరోజు (శనివారం) డిండి రిజర్వాయర్‌ను కల్వకుంట్ల కవిత మిగతా 2లో...

ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

సంపాదకీయం

బీసీల భవిత మారాలంటే అధికారంలో వాటా కల్పించాలి!

రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీలు.. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబాటే.. ఎన్నికల హామీలు అమలయ్యేదెప్పుడు?



తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో బీసీల పాత్ర అత్యంత కీలకమైనది. వ్యవసాయం నుంచి పారిశ్రామిక రంగం వరకు, చేతివృత్తుల నుంచి వ్యాపార రంగం వరకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నుంచి పట్టణ అభివృద్ధి వరకు బీసీ వర్గాలు తమ శ్రమతో సమాజ నిర్మాణంలో కీలక భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలు మాత్రం నేటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నారు. తరతరాలుగా కష్టపడుతూ సమాజానికి సేవలందిస్తున్న ఈ వర్గాలకు విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక స్వావలంబన వంటి రంగాల్లో సమాన అవకాశాలు అందకపోవడం సామాజిక న్యాయానికి సవాలుగా మారుతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ రాజకీయ పార్టీలు బీసీల అభ్యున్నతి గురించి గొప్పగా మాట్లాడుతున్నాయి. అధికారంలో వాటా కల్పిస్తామని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని, కులవృత్తులను అభివృద్ధి చేస్తామని హామీలు ఇస్తున్నాయి. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ హామీల అమలులో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. **కులగణనతో బీసీలకు కొత్త ఆశలు**తెలంగాణలో బీసీ కులగణన చేపట్టడం సామాజిక న్యాయం దిశగా ఒక కీలక పరిణామం. ఇప్పటివరకు బీసీల జనాభా, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అనేక చర్చలు జరిగినప్పటికీ కులగణన ద్వారా మరింత స్పష్టమైన గణాంకాలు అందుబాటులోకి వచ్చాయి. ఏ వర్గం ఎంతమంది ఉన్నారు? వారి విద్యా స్థాయి ఎలా ఉంది? ఉద్యోగాలు, ఉపాధి, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి వెనుకబాటుతనం ఉంది? అనే అంశాలను అర్థం చేసుకోవడానికి ఈ గణాంకాలు ఉపయోగపడతాయి. అయితే కులగణన నిర్వహించడంతోనే ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు. సేకరించిన వివరాల ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాలి. జనాభాను లెక్కించడం ఎంత ముఖ్యమో, ఆ జనాభాకు తగిన అభివృద్ధి ఫలాలు అందించడం అంతకంటే ముఖ్యం. కులగణన గణాంకాలు కేవలం ప్రభుత్వ రికార్డులకే పరిమితం కాకుండా బీసీల జీవితాల్లో వాస్తవ మార్పులకు పునాదిగా మారాలి. **రాజకీయ ప్రాతినిధ్యమే సామాజిక న్యాయానికి పునాది**బీసీలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా బలంగా ఉంది. ఈ విషయంలో శాసనపరమైన, న్యాయపరమైన అడ్డంకులు ఎదురవుతున్న నేపథ్యంలో వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించాలి. బీసీలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరగకుండా చూడాలి. గ్రామపంచాయతీల నుంచి మండల, జిల్లా పరిషత్‌ల వరకు బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించాలి. శాసనసభ, శాసనమండలి, పార్లమెంటులోనూ వారి గొంతుక వినిపించే అవకాశం ఉండాలి. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణించకుండా పార్టీ నిర్ణయాలు, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో భాగస్వాములను చేయాలి. జనాభాలో గణనీయమైన వాటా ఉన్నప్పటికీ అధికార నిర్ణయాల్లో తగిన స్థానం లేకపోవడం బీసీ సమాజంలో అసంతృప్తికి కారణమవుతోంది. రాజకీయంగా బలపడినప్పుడే తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించుకునే అవకాశం ఉంటుంది. **విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఏదీ?**బీసీ సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమైన ఆయుధం. పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. అయితే బీసీ విద్యార్థులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా పేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించే తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆశపడుతున్నారు. కానీ ప్రభుత్వ సహాయం సకాలంలో అందకపోవడంతో అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమవుతున్నారు. ఇది వారి భవిష్యత్తుపైనే కాకుండా మొత్తం సమాజ అభివృద్ధిపై ప్రభావం చూపుతుంది. అందువల్ల ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేయాలి. బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలను విస్తరించాలి. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ, డిజిటల్ విద్యా సదుపాయాలు కల్పించాలి. పేద విద్యార్థులు ఆర్థిక కారణాలతో ఉన్నత విద్యకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. **ఉన్నత విద్య ఉన్నా ఉద్యోగాలు కరువు**బీసీ యువతలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. డిగ్రీలు, పీజీలు, సాంకేతిక విద్యలు పూర్తిచేసినప్పటికీ తగిన ఉద్యోగాలు లభించక చాలామంది యువత నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ప్రైవేటు రంగంలోనూ ఆశించిన అవకాశాలు లభించడం లేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో కొంతమంది యువత తమ చదువుకు తగిన ఉద్యోగాలు కాకుండా తక్కువ వేతనాలకు పనిచేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు బీసీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలి. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలు, వ్యాపార రంగాల్లోకి అడుగుపెట్టే యువతకు ఆర్థిక సహాయం అందించాలి. బ్యాంకు రుణాలు, సబ్సిడీలు సులభంగా లభించేలా చర్యలు తీసుకోవాలి. కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే పరిస్థితి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి బీసీ యువత ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహించాలి. **కులవృత్తులకు ఆధునిక సాంకేతికత జోడించాలి**బీసీ వర్గాల్లో అనేక కులాలు తరతరాలుగా సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నాయి. నాయీబ్రాహ్మణులు, రజకులు, కుమ్మరులు, కమ్మరులు, వడ్రంగులు, మేదరులు, గౌడలు, యాదవులు, ముదిరాజులు, పద్మశాలీలు తదితర వృత్తిదారులు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారు. ఒకప్పుడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఈ వృత్తులు ఆధునికీకరణ, యంత్రాల వినియోగం, మార్కెట్ పోటీ కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. పెట్టుబడి లేకపోవడం, ఆధునిక పనిముట్లు అందుబాటులో లేకపోవడం, ఉత్పత్తులకు సరైన ధర లభించకపోవడం వల్ల వృత్తిదారుల ఆదాయం తగ్గుతోంది. యువత సంప్రదాయ వృత్తులపై ఆసక్తి కోల్పోతుండటంతో కొన్ని వృత్తులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కులవృత్తుల పరిరక్షణకు ప్రత్యేక విధానం తీసుకురావాలి. ఆధునిక యంత్రాలు, పనిముట్లు, నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి. వృత్తిదారులు తయారుచేసే వస్తువులకు మార్కెట్‌లో తగిన గుర్తింపు, ధర లభించేలా సహకరించాలి. సంప్రదాయ వృత్తులను ఆధునిక వ్యాపారాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.

(మొదటి పేజీ తరువాయి)

మేడిగడ్డ వద్ద పాతిపెట్టడమే



ప్రచారం చేస్తున్నారని, దానివల్ల ప్రపంచవ్యాప్తంగా కరవు వస్తే తెలంగాణలోనే వచ్చినట్లు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనుండి కట్టించానని హరీశ్‌రావు గొప్పగా చెప్పుకున్నారని, తన పేరు హరీశ్‌రావు కాదని, కాళేశ్వరరావు అని నాటి గవర్నర్‌తో భజన చేయించుకున్నారని ఎద్దేవా చేశారు. తామే కట్టామని గొప్పలు చెప్పుకున్న వాళ్లు ఇప్పుడు మేడిగడ్డ కూలిపోతే ఎందుకు బాధ్యత వహించట్లేదని నిలదీశారు.మేడిగడ్డ వద్ద వాళ్లను పాతిపెట్టడమే వాళ్లకు సరైన శిక్ష అని సీఎం నిప్పులు చెరిగారు. మేడిగడ్డ బ్యారేజీలో నీళ్లు నిల్వ లేకపోతే కన్నెపల్లి పంపులు పనిచేయవని, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లోనూ నీళ్లు నిల్వ చేయలేని దుస్థితి అని పేర్కొన్నారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. మేడిగడ్డతో సంబంధం లేకుండా నీళ్లు ఎత్తిపోసేది ఉంటే మరి అది ఎందుకు కట్టినట్లు? అని నిలదీశారు. పదేళ్లపాటు పాలమూరు జిల్లాను పట్టించుకున్నవాళ్లే లేరని వెల్లడించారు.

భాగ్యనగరంలో నీటి యుద్ధం

వర్షాకాలం ముగిసే అక్టోబర్ నాటికే తీవ్రరూపం దాల్చడం నగర భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. స్నానాలకు, వంటలకు నీళ్లు దొరక్క హాస్టళ్లు, ఐటీ ఉద్యోగులు, సాధారణ పౌరులు అల్లాడుతుండగా.. వాటర్ ట్యాంకర్ల కోసం నగరవాసులు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది.భూగర్భ జలశాఖ సేకరించిన తాజా అధ్యయనాలు నగరంలో క్షీణిస్తున్న నీటి నిల్వల వాస్తవాలను తేటతెల్లం చేస్తున్నాయి.రాష్ట్ర సగటు: తెలంగాణ వ్యాప్తంగా 554 మండలాల్లో పరిశీలిస్తే సగటు భూగర్భ జలమట్టం 8.28 మీటర్లు (సుమారు 27 అడుగులు)గా ఉంది.హైదరాబాద్ పరిస్థితి: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సగటు నీటిమట్టం 7.17 మీటర్లు (సుమారు 23.5 అడుగులు) కాగా, నగరంలోని దాదాపు 31 శాతం ప్రాంతాల్లో నీటిమట్టం ప్రమాదకర స్థాయి కంటే ఎక్కువ లోతుకు పడిపోయింది.కూకట్‌పల్లిలో తీవ్ర సంక్షోభం: కూకట్‌పల్లి పరిశీలన కేంద్రంలో జలమట్టం ఏకంగా 48.35 మీటర్ల లోతుకు (దాదాపు 159 అడుగులు) పడిపోయింది. ఇది సుమారు 16 అంతస్తుల భవనం ఎత్తుకు సమానం. ఒక్క ఏడాది వ్యవధిలోనే ఇక్కడ నీటిమట్టం మరో 3.86 మీటర్లు (దాదాపు 12.7 అడుగులు) అడుగంటింది.జలమండలి చరిత్రలోనే రికార్డు: అక్టోబర్‌లోనే 2.2 లక్షల ట్యాంకర్లు! నగరంలో నీటి కొరత తీవ్రతను ట్యాంకర్ల బుకింగ్ గణాంకాలు స్పష్టంగా రుజువు చేస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లో 87 వేల ట్యాంకర్లు బుక్ కాగా.. ఈ ఏడాది అక్టోబర్‌లో ఏకంగా 2.2 లక్షల ట్యాంకర్లు బుక్ అయ్యాయి.సాధారణ వర్షాకాలంలో రోజుకు 1,500 నుంచి 2,000 ట్యాంకర్ల డిమాండ్ ఉండగా, ప్రస్తుతం ప్రతిరోజూ 7 వేలకు పైగా ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి.మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, మణికొండ, కూకట్‌పల్లి, అమీర్‌పేట్ వంటి ఐటీ, రెసిడెన్షియల్ ప్రాంతాల్లో బుక్ చేసిన ట్యాంకర్ రావడానికి 2 నుంచి 3 రోజుల సమయం పడుతోంది.డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్యాంకర్ ఆపరేటర్లు ఒక్కో ట్యాంకర్‌కు ?2,000 నుంచి ?3,000 వరకు వసూలు చేస్తూ సామాన్యుల జేబులను గుల్ల చేస్తున్నారు. హాస్టళ్లు, పీజీలలో నీటి కొరత తాళలేక తాత్కాలికంగా మూసివేసే ఆలోచనలో నిర్వాహకులు ఉన్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

'బీజేపీ మన ప్రజాస్వామ్యాన్ని

తనకు విశ్వాసం ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వ్యవస్థలను పునరుద్ధరించడం అంత సులభం కాదని అభిప్రాయపడ్డారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, రాజకీయ పార్టీల నుంచి గట్టి ప్రయత్నం అవసరమని చెప్పారు. ప్రజలు ప్రస్తుతం అసహనానికి గురవుతున్నారని, దేశంలో జరుగుతున్న పరిణామాలను గుర్తిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ తాను ఆశావాదంతో ఉన్నానని, దేశంలో మళ్లీ మంచి పాలన రావడాన్ని ప్రజలు స్వాగతిస్తారని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎమర్జెన్సీపై ఇందిరా గాంధీ నిర్ణయం

1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై కూడా సోనియా గాంధీ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ 21 నెలల కాలంలో ప్రజాస్వామ్య హక్కులపై ఆంక్షలు విధించినప్పటికీ, ఆ తర్వాత ఇందిరా గాంధీ పరిస్థితిని గుర్తించి ప్రజాస్వామ్య మార్గంలోనే ముందుకెళ్లారని చెప్పారు. ఎమర్జెన్సీ ముగిసిన తర్వాతే, ఆ సమయంలో జరిగిన పరిణామాల తీవ్రత తనకు పూర్తిగా అర్థమైందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులను పరిమితం చేయడంతో పాటు హెబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేశారని గుర్తుచేశారు. అయితే అప్పటి చర్యలన్నీ రాజ్యాంగబద్ధంగానే జరిగాయని ఆమె వ్యాఖ్యానించారు.

ఆ కాలం నాటి పరిస్థితులను ఇందిరా గాంధీ కోణంలో పరిశీలిస్తే, ఆమె ఎదుర్కొన్న సవాళ్లు అర్థమవుతాయని సోనియా అన్నారు. హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థలకు నిప్పు పెట్టడం, విస్తృత స్థాయిలో అశాంతి నెలకొనడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. అంతేకాకుండా అధికార యంత్రాంగం, సాయుధ దళాలు ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించాలనే పిలుపులు కూడా వచ్చాయని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విధించినప్పటికీ, ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రజాస్వామ్య ప్రక్రియకు తిరిగి వచ్చారని సోనియా గుర్తుచేశారు. పరిస్థితులను స్వయంగా సమీక్షించి 1977 మార్చిలో సార్వత్రిక ఎన్నికలకు పిలుపునిచ్చారని చెప్పారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన అరాచకాలు, దురాగతాలపై అనంతరం బహిరంగంగా విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని తెలిపారు. గతంలో జరిగిన పరిణామాలను, ఆ తర్వాతే సరైన దృక్పథంతో విశ్లేషించగలమని సోనియా అభిప్రాయపడ్డారు. ఎమర్జెన్సీ సమయంలో జరిగిన తప్పులను గుర్తించి ఎన్నికలకు వెళ్లిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.



తన ఆత్మకథలో ప్రేమకథ

ఇంటర్వ్యూలో తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' గురించి కూడా సోనియా గాంధీ మాట్లాడారు. ఈ పుస్తకం కేవలం తన వ్యక్తిగత ప్రేమకథ మాత్రమే కాదని, తన జీవితంలో చోటుచేసుకున్న అనేక కీలక పరిణామాలను వివరిస్తుందని చెప్పారు. మాజీ ప్రధాని, తన భర్త రాజీవ్ గాంధీతో పరిచయం, ఆయన కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, ఆ కుటుంబం ద్వారా భారతదేశంతో తనకు ఏర్పడిన సంబంధం వంటి విషయాలను ఇందులో వివరించినట్లు తెలిపారు. రాజీవ్ కుటుంబాన్ని, ఈ దేశాన్ని ప్రేమించడం మొదలుపెట్టిన తీరు ఇందులో ఉంటుందని చెప్పారు.

రాజీవ్ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు, ఆ త్యాగాల వెనుక ఉన్న లక్ష్యాలకు ముప్పు ఏర్పడటం, కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్న పరిస్థితులు తనను ప్రజా జీవితంలోకి వచ్చేలా చేశాయని సోనియా వెల్లడించారు. ఇంతకాలం తన జీవితంలోని ఈ విషయాల గురించి మాట్లాడాలనే ఆసక్తి తనకు లేదని, అయితే ఇప్పుడు వాటిని పుస్తక రూపంలో పంచుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో వెలువడిన ఈ స్వీయచరిత్రలో సోనియా గాంధీ జీవిత ప్రయాణాన్ని వివరించారు. యుద్ధానంతర ఇటలీలో గడిపిన బాల్యం నుంచి భారతదేశానికి రావడం వరకు జరిగిన పరిణామాలను ఇందులో పొందుపరిచినట్లు ఆమె పేర్కొన్నారు.

ఎత్తిపోతల పథకం టెండర్లలోనూ మంత్రి

పేరుతో తెలంగాణ సంపదను దోపిడీ చేస్తున్నారని విమర్శిం చారు.2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయం ప్రస్తుతం రూ.6,825 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పేరుతో అంచనా వ్యయాన్ని భారీగా పెంచుతూ, టెండర్ల ప్రక్రియను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. టెండర్లలో పారదర్శకతకు తావులేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు దక్కేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు.ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి కాంట్రాక్టుల ద్వారా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు క్రోనీ క్యాపిటలిజం, బహిరంగ దోపిడీ అనే పదాలు కూడా సరిపోవని అన్నారు.ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించి, ఇలాంటి దోపిడీకి సరిపోయే కొత్త పదాన్ని సూచించాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ, టెండర్ల ప్రక్రియలోనూ తమకు అనుకూలమైన కంపెనీలకే ప్రయోజనం చేకూర్చే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు.

డిండికి నీళ్లు తీసుకురావడం

సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత మాట్లాడుతూ.. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఉల్పర, శివన్నగూడెంకు నేరుగా గోదావరి నీళ్లు ఇవ్వవచ్చని చెప్పారు. తాము తీసుకొచ్చిన ప్రతిపాదన ఎలాంటిదో, ఎంత ఉపయోగకరమైనదో ఈ జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలుసుకోవాలని అన్నారు. అవసరమైతే ఇంజినీర్లతో తనిఖీ చేయించుకోవాలని సూచించారు. ఎస్ఎల్‌బీసీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు చర్యల వల్ల సొరంగంలో కార్మికులు మృతిచెందారని ఆరోపించారు. గత ప్రభుత్వం టన్నెల్‌ను కొంత నిర్లక్ష్యం చేసిందని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నట్లు కవిత చెప్పుకొచ్చారు.గోదావరి, కావేరి నదుల అనుసంధానం తుపాకులగూడెం వద్దే జరగాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేసుగుర్రం అనుకుంటే కీలు గుర్రం అయ్యిందని, సీఎం రేవంత్ చెప్పిందే మళ్లీ మళ్లీ చెబుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నిర్లక్ష్యాన్ని, బీఆర్ఎస్ నిద్రమత్తును వదిలించాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను గెలిపించాలని కవిత కోరారు. మరోవైపు, పంటలు వేయొద్దంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏమి ఇస్తుందో చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.

దీపావళి తర్వాత తెలంగాణవ్యాప్తంగా

భారత్ సమ్మిట్ నిర్వహణకు మేము వ్యతిరేకం కాదు. తెలంగాణకు పరిశ్రమలు, పెట్టుబడులు వస్తే మేము ఆహ్వానిస్తాం. కానీ రైతులను ఇబ్బంది పెడితే మాత్రం ఊరుకోము. రైతులను ఆదుకోవాల్సిన బాధ్యతను పక్కనపెట్టి.. ఢిల్లీలో రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం మంచి పద్ధతి కాదు. రైతులపై గల బాధ్యతలను మరచి.. రాష్ట్రం కేంద్రంపై నేరాలను నెట్టేందుకు ప్రయత్నిస్తోంది' అంటూ రాంచందర్ రావు తీవ్రంగా విమర్శించారు.

విశాఖ వేదికగా గ్లోబల్ సమ్మిట్ ప్రపంచ పెట్టుబడులే లక్ష్యంగా

ఈ సదస్సులో 59 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామిక దిగ్గజాలు, సాంకేతిక నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.ఈ సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సీఐఐ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి తెలియజేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. విధాన రూపకర్తలు, పెట్టుబడిదారులు, విద్యాసంస్థలు, అంకుర సంస్థలను అనుసంధానించడం ద్వారా చర్చలను వాణిజ్య, సాంకేతిక భాగస్వామ్యాల దిశగా నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితం, సులభతరం అనే భరోసాను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, సెమికండక్టర్ రంగాల్లో ఉన్న పెట్టుబడి అవకాశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.ఈ సదస్సులో మొత్తం 1,250 మందికి పైగా దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొంటారని అంచనా. వీరిలో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులు, 900 మంది భారతీయ ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా, ఈజిప్ట్ వంటి అనేక దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు హాజరుకానున్నారు. అలాగే, ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొంటారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆరు కీలక అంశాలపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. వాణిజ్యం-పెట్టుబడులు, వ్యవసాయం-ఆహార భద్రత, నైపుణ్యాలు-అంతర్జాతీయ ఉపాధి, టెక్నాలజీ-భవిష్యత్ పరిశ్రమలు, స్వచ్ఛ ఇంధనం-సుస్థిర వృద్ధి వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. వ్యాపార సంస్థల మధ్య కొత్త ఒప్పందాలు, భాగస్వామ్యాలను ప్రోత్సహించేందుకు 400కు పైగా బిజినెస్ టు బిజినెస్ (బీటుబీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బిజినెస్ టు గవర్నమెంట్ (బీటుజీ) సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపు వస్తుందని, రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల కుటుంబాల్లో

రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పుకొచ్చారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరడం లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో సంతోషకరమైన విషయమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

17 ఏళ్ల నిరీక్షణకు తెర



చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది.2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చిందిఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి

ప్రజా అక్షరం న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

నిజాయితీ ద్వారా సమృద్ధి అంశంపై సింగరేణి అధికారులకు అవగాహన

సాఫ్ట్ స్కిల్ ట్రైనర్,ఎన్ ఎల్ పి ప్రాక్టీషనర్ కిషోర్ భగాడియా



ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం, నవంబర్ 7:- సింగరేణి వ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2026 ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ హెచ్.ఆర్.డి ఆద్వర్యంలో శనివారం రామగుండం ఏరియా.1 కాన్ఫరెన్స్ హాలు నందు అవినీతి నిర్మూలనపై "ప్రొబిటీ – పాస్పారిటీ" నిజాయితీ ద్వారా సమృద్ధి అనే అంశంపై కిషోర్ బగాడియా (సాఫ్ట్ స్కిల్ ట్రైనర్,ఎన్ ఎల్ పి ప్రాక్టీషనర్) చే గెస్ట్ లెక్చర్ నిర్వహించారు.ఇందులో ఆర్జి.రీజియన్ కు సంబంధించిన ఆర్జి.1,2,3ఎ ఎల్ పి భూపాలపల్లి ఏరియాల ఉన్నతాధికారులకు అవగాహన కల్పించేలా లెక్చర్ ఏర్పాటు చేశారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శక సేవలపై ఆయన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కిషోర్ బగాడియా (సాఫ్ట్ స్కిల్ ట్రైనర్,ఎన్ ఎల్ పి ప్రాక్టీషనర్) పారదర్శక సేవల ద్వారా సంస్థలు ఏ విధంగా అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలుస్తాయి మంచి పేరు ప్రఖ్యాతలు పొందుతాయో వివరించారు.అవినీతి, లంచగొండితనం వ్యవస్థలను ఎలా భ్రష్టు పట్టిస్తున్నాయో అవగాహన కల్పించారు. అభివృద్ధికి ఆటంకంగా నిలిచే అవినీతి నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై వారు ప్రభుత్వరంగ సంస్థల్లో అవినీతి కార్యకలాపాలు వాటి నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరణాత్మకంగా అవగాహన కల్పించారు.ఈ విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా రామగుండం రీజియన్ అధికారులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జి.1 జీఎం లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లడుతూ సింగరేణి వ్యాప్తంగా విజిలెన్స్ వారోత్సవాల ద్వారా ఉద్యోగుల్లో అవినీతి నిర్మూలన కు తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ స్వయంగా విజిలెన్స్ విభాగం ఏర్పాటు చేసి ఎవరైనా స్వేచ్ఛగా ఫిర్యాదు చేసేలా ప్రోత్సహిస్తుంది.తద్వారా పారదర్శక సేవలు అందరికీ సమానంగా అందేలా కృషి చేస్తుందని జియం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ రీజియన్ యం. మల్లయ్య, జియం ఎస్వో టు జియం కే. చంద్రశేఖర్,ఏరియా ఇంజనీర్ కాశి విశ్వేశ్వర రావు ఆర్జి. రీజియన్ కు సంబంధించిన వివిధ ఉన్నతాధికారులు, ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యాలయంలో ముందస్తు దీపావళి సంబరాలు.



దౌల్తాబాద్, నవంబర్ 7 (ప్రజా అక్షరం) దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో ముందస్తు దీపావళి సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు దీపావళి పండుగ విశిష్టతను తెలియజేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ అని తెలిపారు. విద్యార్థులకు పండుగ ప్రాముఖ్యతను వివరించి, పర్యావరణానికి హాని కలిగించని విధంగా, కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా ముగిశాయి.

అల్లం బుజ్జమ్మ మృతదేహానికి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే చందర్

తెలంగాణ ఉద్యమానికి ముగ్గురు ప్రముఖులను అందించిన మాతృమూర్తి మృతి పట్ల సంతాపం



ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 :- ప్రముఖ కవులు,రచయితలు, జర్నలిస్టులైన అల్లం రాజయ్య, అల్లం వీరయ్య,అల్లం నారాయణల తల్లి అల్లం బుజ్జమ్మ (95) వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో మంథనిలో శుక్రవారం కన్నుమూశారు.ఆమె అంత్యక్రియలను శనివారం పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని స్వగ్రామం గాజులపల్లిలో నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం గాజులపల్లికి చేరుకుని అల్లం బుజ్జమ్మ భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘనంగా సందర్శించారు. పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తెలంగాణ సమాజానికి కవులు, రచయితలు,జర్నలిస్టులుగా సేవలందిస్తున్న అల్లం రాజయ్య,అల్లం వీరయ్య, అల్లం నారాయణలకు జన్మనిచ్చిన మాతృమూర్తి అల్లం బుజ్జమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని చందర్ పేర్కొన్నారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

మండల ప్రజలకు,మహిళలందరికీ దీపావళి శుభాకాంక్షలు:ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవి అశోక్ గుప్తా.



దౌల్తాబాద్ నవంబర్ 7(ప్రజా అక్షరం) దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాధవి అశోక్ గుప్తా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలతో పాటు మండల ప్రజలందరికీ ఆమె హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాధవి అశోక్ గుప్తా మాట్లాడుతూ.. దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. దీపాల వెలుగులతో ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపి, కొత్త ఆశలు, ఆశయాలకు నాంది పలకాలని పేర్కొన్నారు.

మహిళలు కుటుంబ అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని, మహిళలందరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తమ కుటుంబాల్లో ఆనందాన్ని నింపాలని కోరారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి పండుగను జరుపుకోవాలని సూచించారు.

ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సైతం పండుగ ఆనందాన్ని పంచాలని, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా పండుగ సంతోషాన్ని రెట్టింపు చేయాలని అన్నారు. చిన్నారులు బాణసంచా కాల్చే సమయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, మహిళలు, యువత, వ్యాపారులు, రైతులు అందరికీ ఈ దీపావళి సరికొత్త ఉత్సాహాన్ని, విజయాలను అందించాలని మాధవి అశోక్ గుప్తా ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు నిండాలని మరోసారి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు:ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప రవి గుప్తా.



దౌల్తాబాద్ నవంబర్ 7(ప్రజా అక్షరం) దీపావళి పండుగను మండల ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప రవి గుప్తా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మండల ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గంప రవి గుప్తా మాట్లాడుతూ.. దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో దీపావళి కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ పరస్పర ప్రేమాభిమానాలు, సోదరభావంతో కలిసిమెలిసి పండుగను జరుపుకోవాలని కోరారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సైతం పండుగ ఆనందాన్ని పంచుతూ, పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే పండుగల అసలైన ఆనందమని పేర్కొన్నారు. చిన్నారులు, పెద్దలు అందరూ ఆనందంగా దీపావళి వేడుకలు జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మండలంలోని ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని, రైతులు, వ్యాపారులు, కార్మికులు, యువత అందరికీ ఈ దీపావళి కొత్త ఆశలు, అవకాశాలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. మండల ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

టపాసుల హోరు.. వినికిడికి జోరు ముప్పు!



సికింద్రాబాద్, నవంబర్ 07 ప్రజా అక్షరం దీపాల పండుగ దీపావళిని ఇతరులకు ఇబ్బంది కలగకుండా, శబ్ద కాలుష్యానికి దూరంగా జరుపుకోవాలని ప్రముఖ ఆడియాలజిస్ట్ డాక్టర్ గంగరాజు సూచించారు. ప్రస్తుత రోజుల్లో సంబరాల పేరుతో విపరీతమైన శబ్దం చేసే బాణాసంచా కాల్చడం ఎక్కువైందని, ఇది చెవుల వినికిడి శక్తిని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాణాసంచా ఒక్కసారిగా పేలినప్పుడు వచ్చే తీవ్ర ధ్వనుల వల్ల చెవిలోని సున్నితమైన భాగాలు దెబ్బతిని, ఆకస్మిక వినికిడి లోపం (సడెన్ సెన్సోరినూరల్ హియరింగ్ లాస్) తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా చెవుల్లో నిరంతరం ఈలలు వేసినట్లు శబ్దాలు వినిపించే 'టిన్నిటస్' బారినపడే ముప్పు కూడా అధికంగా ఉందని తెలిపారు. మార్కెట్లో లభించే సుతిలి బాంబుల ద్వారా సుమారు 90 డెసిబుల్స్, లక్ష్మీ బాంబుల ద్వారా 94 నుంచి 103 డెసిబుల్స్, 200 వాలా వంటి లడీల ద్వారా ఏకంగా 115 నుంచి 120 డెసిబుల్స్ వరకు విపరీతమైన శబ్ద తీవ్రత వెలువడుతోందని ఆయన వివరించారు. సాధారణంగా 40 డెసిబుల్స్ వరకు శబ్దాలు సురక్షితమైనవే అయినప్పటికీ, 90 డెసిబుల్స్ దాటిన శబ్దాలను వినడం వల్ల తీవ్రమైన వినికిడి లోపం ఏర్పడే ప్రమాదముంది. ఈ తీవ్ర ధ్వనులు పిల్లలు, వృద్ధులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. అలాగే బాణాసంచా పొగ వల్ల ఆస్తమా బాధితులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయని, పక్షులు, జంతువులు తీవ్ర భయాందోళనలకు గురవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అధిక శబ్దాలకు దూరంగా ఉంటూ, సురక్షితమైన రీతిలో వెలుగుల పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

గ్రామస్థాయి సిబ్బందికి దీపావళి కానుకల పంపిణీ.



దౌల్తాబాద్, నవంబర్ 7(ప్రజా అక్షరం) దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి గ్రామంలో దీపావళి పండుగను పురస్కరించుకొని గ్రామస్థాయి సిబ్బందికి స్థానిక సర్పంచ్ ప్రకాష్ ఆధ్వర్యంలో టపాసులు (క్రాకర్స్), స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రకాష్ మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధిలో గ్రామస్థాయి సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా సిబ్బందితో ఆనందాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో క్రాకర్స్, స్వీట్ బాక్సులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా అక్షరం న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలి: ఎంఈఓ గజ్జెల కనకరాజు.

దొమ్మాట పాఠశాలలో ప్రత్యేక తరగతుల పరిశీలన.



దౌల్తాబాద్, నవంబర్ 7(ప్రజా అక్షరం) దౌల్తాబాద్ మండలం దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హిందీ సబ్జెక్టుకు సంబంధించిన తరగతి బోధనను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని సూచించారు. పక్కా ప్రణాళికతో చదువుకు సమయం కేటాయించి, ప్రతిరోజూ పాఠాలను పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని అన్నారు. హిందీ భాష జాతీయ స్థాయిలో ఎంతో ప్రాధాన్యత కలిగిన భాష అని, హిందీలో చదవడం, రాయడం, మాట్లాడటం అనర్గళంగా నేర్చుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భాష మాట్లాడటంలో కానీ, పాఠాలు అర్థం చేసుకోవడంలో కానీ ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్, ఉపాధ్యాయులు మహాలక్ష్మి, మధురకవి, యాదగిరి, శ్రీధర్, రమేష్, సాగరిక, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో గౌరవప్రదంగా వ్యవహరించాలి

:- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం,విశ్వాసం పెంపొందించాలి.
:- కేసుల్లో నిందితులకు శిక్షపడేలా కృషి చేయాలి
:- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



ప్రజా అక్షర (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 : బాధితులు మానసిక వేదనలో ఉంటారని, వారితో సున్నితత్వం తో,గౌరవప్రదం గా వ్యవహరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు.శనివారం సీపీ కార్యాలయంలో కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేసి, బలమైన సాక్ష్యాధారాలు కోర్టులో సమర్పించాలన్నారు. కోర్టు సమన్లు సకాలంలో అందజేసి సీసీటీఎన్ఎస్ లో నమోదు చేయాలని,పెండింగ్ వారెంట్లను త్వరితగతిన అమలు చేయాలని ఆదేశించారు.3 సంవత్సరాలుగా బలమైన సాక్ష్యాధారాలు కోర్టులోపెండింగ్ లో ఉన్న వారెంట్లకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.సాక్షుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదుదారు లు,బాధి తులు, సాక్షులు కోర్టుకు సకాలంలో హాజరయ్యేలా చూడాలని సూచించారు.నాణ్యమైన దర్యాప్తు, పక్కా ఆధారాల సేకరణ,సకాలంలో చార్జిషీట్ల దాఖలు ద్వారా కన్విక్షన్ శాతం పెంచాలన్నారు.అనంతరం పలు కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ సిబ్బందిని సీపీ శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్,తాండూర్ సీఐ దేవయ్య,సీసీఆర్బీ ఎస్ఐలు ఉపేందర్,వినీత,సీసీ సందీప్ కోర్టు డ్యూటీ సిబ్బంది,కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో తగు జాగ్రత్తలు పాటించాలి యువత చిన్నారులు అప్రమత్తంగా ఉండాలితుర్కపల్లి ఎస్ఐ శివకృష్ణ



తుర్కపల్లి నవంబర్ 7 ప్రజా అక్షరం న్యూస్ తుర్కపల్లి మండలం పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులు బాణసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని తుర్కపల్లి ఎస్ఐ శివకృష్ణ సూచించారు. పండుగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.
బాణసంచా కాల్చే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నారులు ఒంటరిగా టపాసులు కాల్చకుండా తల్లిదండ్రులు తగిన పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. బాణసంచా కాల్చేందుకు సురక్షితమైన ప్రదేశాలను ఎంచుకోవాలని, ప్రజలకు మరియు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.దీపావళి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, ఇతరులకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించకూడదని అన్నారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని ఆయన హితవు పలికారు.అలాగే పోలీసుల సూచనలు, ప్రభుత్వ నిబంధనలను తప్పని సరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివ కృష్ణ హెచ్చరించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ, సురక్షితమైన రీతిలో దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోండి

ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 :- రామగుండం నియోజకవర్గంలోని అంతర్గామ్, పాలకుర్తి మండలాల సర్పంచ్లు,గ్రామ అధ్యక్షులతో ఎమ్మెల్యే ఎంఎస్. రాజ్ ఠాకూర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ముందుగా అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఆదివారం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి దీపావళి జరుపుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా ,అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

చిట్యాల గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ముందస్తు దీపావళి సంబరాలు:



చిట్యాల నవంబర్ 7 (ప్రజా అక్షరం ప్రతినిధి): చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి సందడి చేశారు. పాఠశాల ఆవరణలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దీపాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పూలకంటి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని తెలిపారు. శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఈ పండుగకు ప్రత్యేకతను చేకూర్చిందన్నారు. దీపావళి పండుగ కేవలం దీపాలు వెలిగించడం, బాణసంచా కాల్చడానికే పరిమితం కాదని, మనలోని అజ్ఞానం, అహంకారం, చెడు ఆలోచనలను తొలగి ంచుకొని మంచి మార్గంలో నడవాలనే సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల విశిష్టతను చిన్ననాటి నుంచే విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, సోదరభావం, ఐక్యతతో పండుగలను జరుపుకోవాలని, పర్యావరణానికి హాని కలగకుండా కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని సూచించారు. దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలి – సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి



చిట్యాల, నవంబర్ 7 (ప్రజా అక్షరం ప్రతినిధి): అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ మహాసభల సందర్భంగా ఈ నెల 15న నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగే రైతు బహిరంగ సభను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. చిట్యాల మండల కేంద్రంలోని మేకల లింగయ్య స్మారక భవనంలో శనివారం జరిగిన రైతు సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అఖిల భారత మహాసభల సందర్భంగా ఈ నెల 14న జరిగే అగ్రి షోలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు హాజరు కానున్నట్లు తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట గడ్డ నల్లగొండలో చారిత్రక సభలను విజయవంతం చేయాలని కోరారు. జిట్ట నగేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు అవిశెట్టి శంకరయ్య, చింతపల్లి బయ్యన్న, కుమ్మరి శంకర్, చెర్కు పెద్దులు, కత్తుల లింగస్వామి, ఎస్.ఆర్. వెంకటేశ్వర్లు, అరూరి శ్రీను, ఆమనగంటి ఐలయ్య, చిలుముల రామస్వామి, మురారి మోహన్, పాముగుళ్ళ అచ్చాలు, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ రామన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ గా పాశం స్వరూప సత్తిరెడ్డి



వలిగొండనవంబర్ 7 ప్రజా అక్షరం ప్రతినిధి వలిగొండ రామన్నపేట మండలాల వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గా మండల పరిధిలోని రెడ్ల రేపాకగ్రామానికి చెందిన పాశం స్వరూప సత్తిరెడ్డిని నియామకం చేసినట్లు శనివారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ స్వరూప సత్తిరెడ్డి మాట్లాడుతూ తన పట్ల ఎంతో నమ్మకం ఉంచి రెండు మండలాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా ప్రకటించినందుకు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు కృతజ్ఞతలను తెలిపారు తన మీద ఉన్న విశ్వాసంతో ఈ పదవిని ఇచ్చినందుకు నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారంకోసం ముందుండి పనిచేస్తానని ఆమె అన్నారు ఇంకా తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలను తెలియజేశారు

రైతు సమస్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు:

ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు



చిట్యాల, నవంబర్ 7 (ప్రజా అక్షరం ప్రతినిధి) అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చిట్యాల పట్టణంలోని సరస్వతి జూనియర్ కళాశాల విద్యార్థులకు రైతుల సమస్యలు, రైతు వ్యతిరేక చట్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నకిరేకల్ డివిజన్ అధ్యక్షుడు ఆరూరి ప్రణీత్ మాట్లాడుతూ.. రైతు దేశానికి వెన్నుముక అని, అలాంటి రైతులు దేశవ్యాప్తంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత రైతుల కష్టాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని విమర్శించారు.డిమాండ్ చేశా రు.దేశంలో బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకునేలా పోరాటంలో ఏఐకెఎస్ ముందువరుసలో నిలిచిందని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని రైతుల పక్షాన సుదీర్ఘకాలంగా పోరాటం కొనసాగిస్తోందన్నారు.36వ జాతీయ మహాసభల్లో భవిష్యత్తులో చేపట్టాల్సిన రైతు ఉద్యమాలపై విస్తృతంగా చర్చించడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే వరకు పోరాటం కొనసాగించనున్నట్లు తెలిపారు. రైతుల పేరుతో అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు న్యాయం చేయలేని పరిస్థితిలో ఉన్నాయని విమర్శించారు. ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా రైతుల సాగు కష్టాలను తగ్గించే అంశాలపై కూడా మహాసభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చిట్యాల మండల టౌన్ కన్వీనర్ చింత చందు, మనోజ్, వంశీ, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అక్షర న్యూస్
TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

ఎల్ నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలి

తుర్కపల్లి, నవంబర్ 07 ప్రజా అక్షరం న్యూస్

ఎల్ నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డి శ్రీనాథ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై గ్రామాల్లో చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఎల్నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా ప్రతిరోజు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ ధనావత్ శంకర్ నాయక్ ,ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తాసిల్దార్ రవికుమార్ ,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చాడ భాస్కర్



రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ అనూష టైపిస్టు సంపత్ కార్యాలయ సిబ్బంది భాగ్యలక్ష్మి,అన్వర్ ,శ్రీనివాస్ రెడ్డి,వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు

నిరుపేద ముస్లిం కుటుంబానికి అండగా నిలిచిన వ్యాల్ల హరీష్ రెడ్డి

దివ్యాంగుడి కుమార్తె వివాహానికి 10 వేల ఆర్థిక సహాయం

ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 :-

గోదావరిఖని అడ్డగుంటపల్లి స్వతంత్ర చౌక్‌కు చెందిన దివ్యాంగ నిరుపేద సర్వర్ పాషా కుమార్తె సుభాని వివాహం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ళ హరీష్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.10,000/- ఆర్థిక సహాయం అందజేశారు.రామగుండం కార్పొరేషన్ మాజీ కో-ఆప్షన్ మెంబర్ తస్నిమ్ భాను చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని అంది ంచడం జరిగింది.ఈ సందర్భంగా తస్నిమ్ భాను మాట్లాడుతూ, రామగుండం నియోజకవర్గంలో పేద ముస్లిం కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీ ముబారక్ పథకం ప్రస్తుతం నిలిచిపోయినప్పటికీ, నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగాలనే ఉద్దేశంతో వ్యాళ్ళ హరీష్ రెడ్డి తన వంతు సహాయంగా రూ.10,000/- అందించినట్లు తెలిపారు.అదేవిధంగా ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా దాదాపు 600 మంది ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తూ, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అండగా నిలుస్తున్న వ్యాళ్ళ హరీష్ రెడ్డి ముస్లిం



సమాజానికి ఆత్మబంధువుగా మారారని పేర్కొన్నారు.పేద కుటుంబాల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా, మైనార్టీ నాయకులు హసేన్ చిస్తీ,జాఫర్,రాజ్ మహమ్మద్,మున్వార్ తదితరులు పాల్గొన్నారు.పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న వ్యాళ్ళ హరీష్ రెడ్డి సేవలను పలువురు అభినందించారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు
రైతులకు అందుబాటులోకి కొనుగోలు కేంద్రం

నర్వ నవంబర్ 7(ప్రజా అక్షరం న్యూస్) నర్వ మండల పరిధిలోని పాతర్‌చేడ్, శనివారం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి. కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం చెన్నప్ప, మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మెరుగైన



సేవలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అందకాడి లింగమ్మ, మన్యం సింగిల్ విండో డైరెక్టర్ పల్లె శేఖర్, రాయకోడ్ గ్రామ సర్పంచ్ రవికుమార్, ఉపాధ్యక్షుడు శరణప్ప, మహేష్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 :-

రామగుండం పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా మస్జీద్ టర్నింగ్ వద్ద సెంటర్ లైటింగ్ ను ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం కలలో సంతోషం చూడడమే తన లక్ష్యమని అన్నారు.రామగుండం పట్టణంలో రూ.35 కోట్లతో బి-పవర్ హౌస్ గడ్డ (హనుమాన్ జంక్షన్) నుంచి లింగాపూర్ వరకు,స్టేషన్ ఫైఓవర్ వరకు రోడ్లు,సెంట్రల్ లైటింగ్,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రామగుండం అభివృద్ధిపై నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి గల్లీలో రోడ్లు,డ్రైనేజీ,లైటింగ్ పనులు జరుగుతున్నాయని అన్నారు.అతి త్వరలో రామగుండంలో 1ఇ800 మెగావాట్ల పవర్ ప్లాంట్ పనులు మొదలవుతాయని,200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభమయ్యాయని,1.50 కోట్లతో జెడ్పీహెచ్ఎస్ స్కూల్, రిజిస్ట్రేషన్ ఆఫీస్,కొత్త ఎమ్మార్వో ఆఫీస్ పనులు జరుగుతున్నాయని తెలిపారు.సుమారు 1000 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని,సొంత స్థలం ఉంటే రూ.5 లక్షలు ఇచ్చి ఇల్లు కట్టిస్తామని చెప్పారు. మైనారిటీల కోసం 25 గుంటల్లో రూ.2 కోట్లతో మైనారిటీ



కమ్యూనిటీ హాల్ మంజూరు చేశామన్నారు. హౌసింగ్ బోర్డులో రూ.2 కోట్లతో జరుగుతున్న వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు.30వ డివిజన్ ఇంద్రానగర్, మహబూబ్ సుభాని నగర్, ఖాదర్ కాలనీ,హౌసింగ్ బోర్డ్, 29, 25, 26, 27, 28 డివిజన్లలో ప్రతి గల్లీలో రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని తెలిపారు. జరుగుతున్న అభివృద్ధిని చూడలేక విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ కు ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, సీనియర్ నాయకులు అయోధ్య సింగ్,జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ దీటి బాల రాజు, కార్పొరేషన్ అధ్యక్షులు ముస్తఫా, కార్పొ ంటర్లు,మాజీ కార్పొరేటర్లు,వివిధ విభాగాల అధ్యక్షులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

చిన్న వీధుల్లోనూ అంబులెన్స్ వెళ్లేలా రోడ్లు



మేయర్ మహంకాళి స్వామి

ప్రజా అక్షరం (ప్రతినిధి), రామగుండం,నవంబర్ 7 :-

చిన్న చిన్న వీధులలో కూడా అత్యవసర పరిస్థితుల్లో కనీసం అంబులెన్స్ వెళ్ళేలా రహదారుల నిర్మాణం చేపడుతున్నామని రామ గుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులు రూ 7.5 కోట్ల ప్యాకేజీ పనుల్లో భాగంగా రామ గుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. డి ఎం ఎఫ్ టి నిధులురూ 15.00 లక్షల అంచనా వ్యయంతో 53వ డివిజన్ ఎల్ ని నగర్ లోని ఒక వీధిలో సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ గట్ల రమేష్ తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సంద ర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెడల్పైన రహదారుల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.నగరంలోని ప్రతి వీధిలోని చివరి ఇంటివరకు రోడ్డు,యుజిడి,మశీచి నీటి సరఫరా,వీధి లైట్లు తదితర అన్ని మౌళిక వసతులు కల్పించాలనే ఎంఎల్ ఎ రాజ్ ఠాకూర్ లక్ష్యం మేరకు అన్ని డివిజన్ లలోనూ పనులు జరుగుతున్నాయని అన్నారు. నాణ్యతతో పనులు పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్తఫా,అడ్డాల గట్టయ్య,డేవిడ్ రాజు, నాయకులు రాజేందర్,మారెల్లి రాజిరెడ్డి,ధరణి, జలపతి నగర పాలక సంస్థ ఎఇ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

ఇరవై రోజులు కావస్తున్న ఒక్క గింజ కూడా కొనలేదు.



షరతులు లేకుండా ధాన్యము కొనుగోలు చేయాలి...24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ కావాలి....బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్

రాజాపేట నవంబర్ 7 (ప్రజా అక్షరం): ఇరవై రోజులు కావస్తున్న ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు పోసిన ధాన్యం కుప్పల్లో ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని, షరతులు పెట్టకుండా వెంటనే ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, నేతలు ఆరోపించారు. శనివారం బిఆర్ఎస్ ఖాతాల్లో డబ్బులు వేయాలని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఐకెపి సెంటర్లు సందర్శించి మాట్లాడారు. రైతులకు భరోసా ఇస్తూ వడ్ల కాంట అయ్యేటట్లు చూడాలని తహశీల్దార్ కి, కోపరేటివ్ బ్యాంకు సెక్రటరీ, డిసిఎస్ ఓలతో కాంటా చేయాలని మాట్లాడినట్టు తెలిపారు. మొత్తం మండలంలో 19 ధాన్యం కొనుగోలు సెంటర్లు ఉన్నాయని, దాదాపుగా 20 రోజులు గడిచినా 700 రైతుల కుప్పల నుండి ఒక గింజ కూడా కాంటా చేయలేకపోతు న్నారన్నారు. 15 ఐకెపి కేంద్రాలు ప్రారంభించి పట్టించ ుకోవడంలేదని విమర్శించారు. మండలంలో రైతులు ఆకాశాన్ని చూసి ఆందోళన చెందుతున్నారని, వడ్లు తడిస్తే మ్యాచింగ్ లేదని రైతులను మళ్లీమళ్లీ ఆరబోస్తే పండించిన దానికంటే కూలీ రేట్లు ఎక్కువైతున్నాయన్నారు.బిఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి వడ్లు కొనే వరకు కూడా పోరాటం చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, జలసాధన సమితి అధ్యక్షులు ఎర్రగోకుల జస్వంత్, రాజాపేట గ్రామ శాఖ అధ్యక్షులు బెడిద వీరేశం, కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కాకళ్ళ ఉపేందర్, మాజీ ప్రజా ప్రతినిధుల పోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, సోషల్ మీడియా కన్వీనర్ గంధమల్ల సురేష్, దగ్గుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ మండల మూడుమల్ గ్రామంలో పార్టీకి భారీ షాక్

కృష్ణ నవంబర్ 7 (ప్రజా అక్షరం న్యూస్)

మూడుమల్ గ్రామ సర్పంచ్ బాలరాజు గారితో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ డా. వాకిటి శ్రీహరి గారు గుర్జాల్ సభ లో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి శ్రీహరి గారు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి చేరుతున్నట్లు మరియు రానున్న రోజులలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో కి చేరికలు ఉంటాయని సర్పంచ్ బాలరాజు గారు అన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ కుటుంబంలోకి చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం! ?
జై కాంగ్రెస్ -- జై జై కాంగ్రెస్!



ప్రజా అక్షర న్యూస్
TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

ఈ నెల 19 నుంచి ఉచిత చీరల పంపిణీ - రేషన్ కార్డుంటే చాలు - ఈసారి రంగు మారింది



హైదరాబాద్:తెలంగాణలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఇందిరా గాంధీ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. దీనిని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, రాజధాని శివార్లలోని మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.చీరల పంపిణీ పథకానికి రూ.334 కోట్లు కేటాయింపు

రాష్ట్రంలో 2026 సంవత్సరానికి ఉచిత చీరల పంపిణీ పథకం కోసం ప్రభుత్వం రూ.334 కోట్లను కేటాయించింది. గతంలో చీరలు పాల పిట్ట రంగులో ఉండగా, ఈసారి ఎరుపు జరీ అంచుతో కూడిన చిలక పచ్చ రంగును ఎంపిక చేశారు. ఏప్రిల్ నుంచి సిరిసిల్లతో పాటు మరో 13 కేంద్రాల్లో చీరల ఉత్పత్తి ప్రారంభమైంది. మొత్తం 95 లక్షల మందికి పంపిణీ చేయాలన్న లక్ష్యంతో, ఇప్పటి వరకు 65 లక్షల చీరలను తయారు చేశారు.ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొనిఈ చీరలను ఇప్పటికే జిల్లాలకు పంపారు. దాదాపు 2 నెలల క్రితమే సగానికి పైగా చీరలు సిద్ధమైనప్పటికీ, దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 19న చీరలను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలిపారు.చీరల పంపిణీ కోసం ప్రత్యేక యాప్తెల్ల రేషన్?కార్డులు ఉన్న కుటుంబాల్లోని మహిళలకు వారం రోజుల పాటు ఈ చీరలను పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీ కోసం ఓ ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేశారు. మహిళలు పంపిణీ కేంద్రాలు లేదా ఇళ్ల వద్ద పంచాయతీ అధికారులకు తమ ఆధార్ కార్డులను చూపించాలి. యాప్ ద్వారా ఫొటో తీసి, వివరాలను ధ్రువీకరించిన తర్వాత చీరలను పంపిణీ చేస్తారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, సెర్ప్? ఉద్యోగులకు ప్రభుత్వం పంపిణీ బాధ్యతలను అప్పగించింది.అధికారులకు సూచనలు

ఇందిరమ్మ చీరల పంపిణీపై ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. అర్హులైన మహిళందరికీ ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు తెలిపారు. మహిళలకు ఇచ్చే చీరల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడొద్దని స్పష్టం చేశారు. సాంకేతికతను మహిళలకు ఇచ్చే చీరల నాణ్యత విషయంలో వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

పాత గుడ్డలతో తయారు చేసిన బెడ్ షీట్స్‌ను రేవంత్ రెడ్డి మనవడు కప్పుకుంటాడా..?



హైదరాబాద్ :గురుకుల టెండర్లను టెస్కో ద్వారానే ఇవ్వాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లజ్జగా, నిస్సిగ్గుగా ఒక దోపిడీ వ్యవస్థను ఎట్ల నడుపుతుందనడానికి సోదాహరణంగా మీకు పత్రికా సమక్షంలో ఇవన్నీ ముందు పెట్టామన్నారు.మన చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రం (కార్పెట్). మరమగ్గాల మీద పాత వస్త్రాలను రీసైకిల్ చేసి తద్వారా యార్‌ను తయారు చేసిన వస్త్రం. దాదాపు ఇది రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది పేదింటి బిడ్డలకు కార్పెట్లుగా ఇచ్చే పథకం ద్వారా అటు చేనేత కార్మికుల నుంచి ఇటు మఫత్‌లాల్ గుజరాత్‌కు చెందిన కంపెనీ, రకరకాల కంపెనీల దగ్గర నుండి తీసుకున్నారు. వాళ్లేమో సిల్క్ మిక్స్‌డ్ రీసైకిల్డ్‌తో తయారు చేసిన కార్పెట్ ఒకటి.. మన తెలంగాణ చేనేత కార్మికులు కష్టించి సాంచల మీద గంటల తరబడి కాళ్లు, చేతులు ఆడిస్తూ వాళ్లకున్న సృజనా త్మకత, మేధా శక్తిని మొత్తం కలగలిపి తయారు చేసిన కార్పెట్ ఇంకోటి.. ఇంకోటేమో బొచ్చు అంటుకుంటదని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ వివరించారు.

రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డికి మెమొరీ లాస్.



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి తమ్ముళ్లకు ఇంత ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చినయ్ బీఆర్ ఎస్ నాయకులు మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తమ్ముళ్ల ఆస్తుల గురించి అసలు విషయం చెప్తా మీకు.. 2023లో బిజినెస్ స్టాండర్డ్ పేపర్‌లో వచ్చిన జాబితా ఇది.. హెచ్ డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక నోటీస్ ఇచ్చింది. పేపర్‌లో ఎగవేతదారులది నోటీస్ ఎప్పుడొస్తది.. మొదట సమాచారమిస్తరు.. ఒకసారి ,రెండుసార్లు ఫోన్ చేస్తరు బ్యాంకుల వాళ్లు నువ్వు అప్పు తీసుకున్నవ్.. పైసలు కట్టు అంటరు. తర్వాత మెయిల్స్ వస్తది.. ఆ తర్వాత మనుషులను పంపుతరు.. ఆ తర్వాత ఇట్లా పేపర్లు వస్తయన్నారు.అనుముల కొండల్ రెడ్డి ఇంటికి నోటీస్ పెట్టారు.. రూ.2.89 కోట్లు అప్పు తీసుకున్నవ్.. గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలోని 300 గజాల జాగా తనఖా పెట్టి రూ.2.89 కోట్లు అప్పు తీసుకున్నవ్.. ఎప్పుడిస్తవ్ వాపస్ అని హెచ్‌డీఎఫ్‌సీ ఇంత పెద్ద అడ్వర్టైజ్‌మెంట్ వేసిందని మన్నె క్రిశాంక్ తెలిపారు. 2023లో మీరు తీసుకున్న రూ.2.89 కోట్లు అప్పు తీర్చడానికి డబ్బులు లేవు కానీ.. ఇవాళ మీరు 50 వేల కోట్ల ఆస్తులు ఎట్లా నిర్మాణం చేస్తరు.. ఎట్లా రక్షణ వైమానిక శాఖ చైర్మన్ అయిపోతవు.. ఎట్లా నీకు రూ.200 కోట్ల జాగాను ప్రభుత్వం ఇస్తది.. ఇంకా దారుణమేంటంటే.. ఇది 2025 కోర్టు డాక్యుమెంట్.. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ వర్సెస్ అనుముల కొండల్ రెడ్డి బ్రదర్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి. ఈ ఆర్డర్ వచ్చింది 2025 నవంబర్ 26. ఈ కేసు ఏంటంటే..రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి ఇన్‌కం ట్యాక్స్ ఎగ్గొట్టేసి.. ఇన్‌కం ట్యాక్స్ కట్టకుండా కొన్ని సంవత్సరాలు దాటవేస్తుంటే.. ఆస్తులు పెరుగుతుంటే ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కేసు వేశారు.

ధరణి అక్రమాలపై సీఐడీ కీలక ఆపరేషన్ - 9 మంది అరెస్ట్



హైదరాబాద్ :తెలంగాణలో ధరణి పోర్టల్ భూ రికార్డుల అక్రమాల వ్యవహారంపై సీఐడీ తన దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో తాజాగా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత నలుగురిని అరెస్ట్ చేసిన సీఐడీ, తాజా చర్యలతో ఈ కేసులో ఇప్పటివరకు బాధ్యులైన తొమ్మిది మందిపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నట్లయింది. ధరణి అక్రమాల గుట్టు రట్టు చేసేందుకు సీఐడీ అధికారులు రెండు రోజుల పాటు (గురువారం రాత్రి, శుక్రవారం) రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆపరేషన్ నిర్వహించారు. ఇందుకోసం 15 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఏకకాలంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.ధరణి పోర్టల? అక్రమాలపై ఆరా!రాజధాని హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర కీలక ప్రాంతాల్లో ఈ సోదాలు సాగాయి. ధరణి పోర్టల్ రోజువారీ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లను, డేటా ఎంట్రీ సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని సీఐడీ అధికారులు క్షుణ్ణంగా విచారించారు. పోర్టల్‌లోకి అక్రమంగా లాగిన్ అయి, విలువైన భూముల యాజమాన్య హక్కులను మార్చినట్లు సీఐడీ ప్రాథమికంగా ఆధారాలు సేకరించింది. సీఐడీ ప్రాథమిక విచారణ అనంతరం వీరిలో నలుగురి పాత్రపై స్పష్టత రావడంతో వారిని అరెస్ట్ చేసింది.ముఖ్యంగా న్యాయస్థానాల్లో ఉన్న కోర్టు కేసులు, కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని రికార్డుల్లో అక్రమ మార్పులు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అత్యంత విలువైన భూదాన్ భూములకు అక్రమంగా బై నంబర్లు సృష్టించి, వాటి యాజమాన్య హక్కులను ఇతరులకు కట్టబెట్టిన ఉదంతాలపై సీఐడీ దర్యాప్తు బృందాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. అయితే ఈ ఆపరేషన్ గురించి సీఐడీ ఉన్నతాధికారులు గోప్యతను పాటిస్తున్నారు. మరో ఒకటి రెండు రోజుల్లో ఈ అంశానికి సంబంధించి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.దర్యాప్తు వేగవంతం చేసిన సీఐడీఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ కోసం సీఐడీ డీజీ చారుసిన్హా నేతృత్వంలో ఏడుగురు ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఫోరెన్సిక్ ఆడిట్‌లో వెలుగు చూసిన డిజిటల్ ఆధారాలు, ఐపీ అడ్రస్‌లు, పోర్టల్ లాగిన్ హిస్టరీ ఆధారంగా ఈ కమిటీ దర్యాప్తును వేగవంతం చేసింది. రికార్డుల మార్పు వెనక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారుల చిట్టాను బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.సీఐడీ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుండటంతో ఈ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు, అక్రమార్కుల పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. చేశారనే విషయంలో డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను ఫోరెన్సిక్ ఆడిట్‌లో కనుగొన్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే సీఐడీ తాజా ఆపరేషన్ నిర్వహించినట్లు సమాచారం.

ఫుట్‌పాత్ జీవనం నుంచి ముఠా నాయకుడిగా - సంపన్న కాలనీలే 'బ్రూస్‌లీ' టార్గెట్



హైదరాబాద్ పనికోసమని నగరానికి వచ్చిన అతనికి ఏ ఉపాధి దొరకలేదు. దీంతో ఫుట్ పాత్‌లపై జీవిస్తూ పని కోసం పగలంతా వివిధ ప్రాంతాల్లో తిరిగేవాడు. అలా తిరుగుతూ పలు ప్రాంతాల రూట్‌మ్యాప్‌పై పట్టు సాధించాడు. అలా ఎక్కువగా అతని చూపు సంపన్నులుండే కాలనీలను ఆకర్షించింది. ఒకరి కింద పని చేయడం ఇష్టం లేని అతను సొంతంగా ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. అంతే ఇక అతను పట్టిందల్లా బంగారమే అయ్యింది. జేబులు రూ.లక్షల కట్టలతో నిండాయి. అలా తన చేతివాటంతో ముఠా నాయకుడిగా చలామణీ అవుతూ పోలీసులకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. ఎన్నిసార్లు జైలుకెళ్లొచ్చినా బుద్ధి మార్చుకోకుండా పదే పదే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అలా తన చేతివాటంతో మరోసారి పోలీస్ రికార్డుల్లో తన పేరు ఎక్కించుకున్నాడు. పోలీసులకు కొరకరాని కొయ్యగా మారిన ఆ కేటుగాడు ఎవరు? అతగాడి గురించి పోలీసులు ఏం చెబుతున్నారుతాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలుఉపాధి వేట కోసం కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అతను చేతివాటానికి అలవాటు పడ్డాడు. ఓసారి తప్పు చేసి జైలుకెళ్లినా, బుద్ధి మార్చుకుని సక్రమంగా ఉంటాడనుకుంటే జైలునే తన అడ్డగా మార్చుకుని ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా రూ.లక్షల సొమ్ము కాజేశాడు. దారి దోపిడీలతో చెలరేగిపోయాడు. పీడీ యాక్ట్ కింద శిక్ష అనుభవించాక కూడా బయటకు వచ్చి మళ్లీ అదే తీరుతో పోలీసులకు కొరకరాని కొయ్యగా మారాడు. బ్రూస్‌లీ గ్యాంగ్ పేరుతో అంతర్రాష్ట్ర దొంగల ముఠాగా మారాడు. సరిగ్గా మూడు నెలల క్రితం ఓ దారిదోపిడీ కేసులో పట్టుబడ్డ బ్రూస్‌లీ అలియాస్ దార్ల నెహెమ్యా మరోసారి హైదరాబాద్ నగరంలో చోరీకి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరాడు.బంగారు ఆభరణాలు, లక్షన్నర నగదు మాయంఅక్టోబర్ 31న సికింద్రాబాద్ అల్వాల్‌లోని జానకీనగర్ కాలనీలో నివాసముండే నరసింహమూర్తి తన కుటుంబంతో కలిసి దమ్మాయిగూడలోని తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లాడు. ఉదయాన్నే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికుడు అతనికి సమాచారమిచ్చాడు. తిరిగొచ్చిన నరసింహమూర్తి ఇంటి పరిస్థితిని చూసి నిర్ఘాంతపోయాడు.ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో బంగారు ఆభరణాలు, రూ.లక్షన్నర నగదు మాయమయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇంటి సమీపంలోని సీసీ కెమెరాల ఆధారంగా ఇది బ్రూస్‌లీ గ్యాంగ్ పనేనని నిర్ధారించారు. బ్రూస్‌లీ మరో ఎపాల్పడి పోలీసులను ఆశ్చర్యపరిచాడు. ఇతనిపై దాదాపు 60కి పైగా కేసులున్నాయి.

డిఫెన్స్ మద్యం అక్రమ దందాలో భార్యాభర్తలు.. ఆల్వాల్‌లో గుట్టురట్టు



హైదరాబాద్, నవంబర్ 7: నగరంలోని ఆల్వాల్‌లో డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. మాజీ సైనికుల కోటా మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. డిఫెన్స్ క్యాంటీన్ల నుంచి తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈరోజు(శనివారం) ఆల్వాల్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ రెండు కేసుల్లో మొత్తం 163 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.2.11 లక్షలు ఉంటుందని అంచనా.మొదటి కేసులో సరస్వతీనగర్ లోతుకుంటలో మన్యం నాగప్రసన్న, రామాంజనేయులు ఇంట్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. డిఫెన్స్ మద్యం అక్రమ విక్రయాలపై సమాచారంతో ఈ దాడులు చేపట్టారు. ఇంట్లో నుంచి దాదాపు 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. భర్త రామాంజనేయులు డిఫెన్స్ క్యాంటీన్ నుంచి మద్యం తీసుకొస్తుండగా.. వాటిని భార్య నాగప్రసన్న విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. భార్య నాగప్రసన్నను అరెస్ట్ చేసి... మద్యం అక్రమంగా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. రెండు కేసుల్లో నిందితులను ఆల్వాల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అధికారులు అప్పగించారు. కేసు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులు.. డిఫెన్స్ కోటా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భార్యను హత్య చేసి గోదావరిలో పడేసిన ఏఆర్ కానిస్టేబుల్.. అరెస్ట్



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 7:

భార్యను అతికిరాతకంగా హత్య చేసిన ఏఆర్ కానిస్టేబుల్‌ను కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రోహిత్ రాజు (శనివారం) మీడియాకు వెల్లడించారు. కొత్తగూడెం ప్రగతినగర్‌లో నివాసముంటున్న ఏఆర్ కానిస్టేబుల్ బొడా నరేందర్ ఈనెల 3న భార్య భవానిని హత్య చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆపై మృతదేహాన్ని గోదావరి నదిలో పడేసినట్లు చెప్పారు. అతడు ఉంటున్న అద్దె ఇంట్లో భార్య గొంతును చున్నీతో బిగించి చంపేశారని అన్నారు. తండ్రి బొడా హరిలాల్ సహాయంతో ద్విచక్ర వాహనంపై డెడ్‌బాడీని తీసుకెళ్లి భద్రాచలం బ్రిడ్జి వద్ద గోదావరిలో పడేసినట్లు వెల్లడించారు.మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డ్ అయినట్లు ఎస్పీ తెలిపారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని అన్నారు. గోదావరిలో భవాని మృతదేహాన్ని గుర్తించి శవ పరీక్ష నిమిత్తం భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. అలాగే నిందితుడు నరేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడి తండ్రి బొడా హరిలాల్ పరారీలో ఉన్నాడని.. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు.ఈ కేసు వేసినప్పుడు ఎందుకు కట్టలేదు.. ఎందుకు అప్పీలు చేయలేదని అంటే కారణం ఏం చెప్పారో తెలుసా..? రేవంత్ రెడ్డి తమ్ముడు రక్షణ వైమానిక శాఖ చైర్మన్, టెసరాక్ట్ కంపెనీ చైర్మన్, కొండల్

ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్ - ఈసారి ఒక్కో పరీక్షకు 2 రోజుల వ్యవధి!



హైదరాబాద్:ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్? విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే దిశగా వార్షిక పరీక్షల మధ్య వ్యవధి పెంచాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. ప్రస్తుతం ఒకరోజు ప్రథమ, మరో రోజు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రతి ఎగ్జామ్?కు కనీసం ఒకరోజు వ్యవధి లభిస్తోంది. అయితే దీన్ని 2 రోజులకు పెంచాలన్నది ప్రభుత్వ యోచన.

ఈ మేరకు సాధారణ పద్ధతిలో ఒక టైమ్? టేబుల్, ఒక్కో పరీక్షకు 2 రోజుల వ్యవధితో మరో షెడ్యూల్?ను ఇంటర్? బోర్డ్? ప్రతిపాదించింది. దీనివల్ల పాఠ్యాంశాల పునశ్చరణకు సమయం లభిస్తుందని, విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తారని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. ఈ మేరకు వ్యవధి ఉండే టైమ్? టేబుల్?కు ఆమోదం లభించవచ్చని సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరి 24న పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.ఎక్కువ వ్యవధి వల్లే ఫలితాల్లో ఉత్తీర్ణతగత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు మార్చి 14న ప్రారంభమై ఏప్రిల్ 13న ముగిశాయి. నెల రోజుల సమయం తీసుకున్నారు. పండుగలు రావడంతో ఒకటి రెండు సబ్జెక్టులకు నాలుగైదు రోజుల వ్యవధి కూడా లభించింది. పదో తరగతికి అంత వ్యవధి అవసరం లేదన్న విమర్శలు, ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా విద్యాశాఖ వెనక్కి తగ్గలేదు. దాని కారణంగానే 95.15 శాతం మంది ఉత్తీర్ణుల య్యారని, అంతకు ముందు సంవత్సరంతో పోల్చుకుంటే ఉత్తీర్ణత 2.37 శాతం విద్యాశాఖ సమర్థించుకుంది.ఇప్పుడు రాయబోయే ఇంటర్?లోనూ పరీక్షల వ్యవధి పెంచాలన్నది విద్యాశాఖ ఆలోచన. ఇంటర్ విద్యార్థుల్లో ఎక్కువ మంది డిసెంబర్ లేదా సంక్రాంతి పండుగ వరకు జేఈఈ, నీట్? పరీక్షలకు సిద్ధమవుతుంటారు. వార్షిక పరీక్షల మధ్య వ్యవధి ఉండటం వల్ల విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు సులభమవుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు పదో తరగతి పరీక్షల మధ్య వ్యవధిని కుదించాలని టీచర్లు కోరుతున్నారు. విద్యార్థులకు నిపుణుల సూచనలివేవిద్యార్థులు పరీక్షలకు ముందు ఆందోళనకర విషయాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దు. ఒత్తిడికి గురికావొద్దు. పరీక్షలను సులువుగా రాస్తామనే భావనతో ముందుకు సాగాలి. ముందుగా కఠిన అంశాలపై దృష్టి పెట్టాలి. పునశ్చరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఏయే పాఠ్యాంశాలు చదివితే ఎక్కువ మార్కులు వస్తాయో వాటిపై దృష్టి పెట్టాలని అధ్యాపకులు సూచిస్తున్నారు. లక్ష్యం మరవకుండా నిత్యం సాధన చేస్తే శతశాతం ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

64 టెస్టులు, 229 వికెట్లు.. అరంగేట్రం చేసిన రోజే వీడ్కోలు చెప్పిన టీమిండియా స్టార్ ప్లేయర్..!



మహ్మద్ షమీ శుక్రవారం (నవంబర్ 6) టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్ట్ అరంగేట్రం వార్షికోత్సవం రోజునే, ఓ భావోద్వేగ వీడియో సందేశంతో ఈ నిర్ణయాన్ని వెల్లడించాడు. "నేను వైట్ జెర్సీని వదులుతున్నాను, కానీ దానితో ముడిపడిన జ్ఞాపకాలను ఎప్పటికీ వదలను" అని అతడు పేర్కొన్నాడు. తన ఎదుగుదలకు సహకరించిన బీసీసీఐ, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగల్ (జూదీ)కు కృతజ్ఞతలు తెలిపాడు.కలల అరంగేట్రం..షమీ 2013 నవంబర్‌లో కోల్‌కతాలో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్‌లోనే తొమ్మిది వికెట్లు తీసి భారత్‌ను గెలిపించాడు. నిర్ణయాత్మక ఇన్నింగ్స్‌లో కేవలం 47 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.ఆస్ట్రేలియా గడ్డపై 2019 ఆరంభంలో భారత్ సాధించిన చారిత్రక టెస్ట్ సిరీస్ విజయంలో షమీ కీలక సభ్యుడు.చివరి టెస్టు..షమీ ఆడిన చివరి టెస్టు 2023 జూన్‌లో లండన్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన 2023-25 డబ్ల్యూటీసీ ఫైనల్. ఆ మ్యాచ్‌లో భారత్ 209 పరుగుల తేడాతో ఘోరంగా ఓడింది. ఆ తర్వాత టెస్ట్ జట్టు ఎంపికల్లో అతడిని పరిగణించలేదు. మూడేళ్లకు పైగా ఎదురుచూసిన షమీ, చివరికి ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు ప్రకటించాల్సి వచ్చింది.
దేశవాళీ క్రికెట్‌లో మాత్రం పదును తగ్గలేదు..
భారత దేశవాళీ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో, ముఖ్యంగా రంజీ ట్రోఫీలో షమీ ఇప్పటికీ వికెట్లు తీసే బౌలరే. ఈ ఏడాది ఆరంభంలో ముగిసిన 2025-26 రంజీ సీజన్‌లో బెంగాల్ తరఫున 13 ఇన్నింగ్స్‌ల్లో 37 వికెట్లు తీసి, టోర్నీలో ఆరో అత్యంత విజయవంతమైన బౌలర్‌గా నిలిచాడు.
ఇక వైట్ బాల్ క్రికెట్‌పై దృష్టి..
గత ఏడాది దుబాయ్‌లో 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పటి నుంచి షమీ స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న కీలకమైన రెండో టెస్టు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సిల్హెట్ వేదికగా సాగుతున్న ఈ పోరులో ఆ జట్టు ఓపెనర్ షాద్మాన్ ఇస్లాం భయంకరమైన ప్రమాదానికి గురయ్యాడు. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదం కారణంగా అతడు మైదానంలోనే నొప్పితో విలవిలలాడిపోయాడు. ప్రఖ్యాత క్రీడా వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం అతని చీలమండ తీవ్రంగా దెబ్బతింది. దీంతో సహచర ఆటగాళ్ళు వెంటనే అతనికి ఫస్ట్ ఎయిడ్ చేసి మైదానం బయటకు తీసుకువచ్చారు.జారిపడిన షాద్మాన్వెస్టిండీస్ ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కరీబియన్ బ్యాటర్ అమీర్ జంగూ ఫైన్ లెగ్ దిశగా కొట్టిన బంతిని ఆపడానికి షాద్మాన్ స్లిప్ ప్రాంతం నుంచి వేగంగా పరుగెత్తుకుంటూ వెళ్లాడు. అయితే ఔట్‌ఫీల్డ్‌లో పేరుకుపోయిన మంచు ప్రభావంతో అతడు ఒక్కసారిగా జారి అదుపుతప్పి కింద పడిపోయాడు. కింద పడుతున్న సమయంలో అతని ఎడమ చీలమండ పూర్తిగా ముడుచుకుపోవడంతో తీవ్రమైన గాయమైంది. నడిచే పరిస్థితి కూడా లేకపోవడంతో సిబ్బంది అతడిని అత్యవసరంగా స్ట్రెచర్‌పై మోసుకుంటూ బయటకు తీసుకువచ్చారు.స్కానింగ్ కోసం ఆసుపత్రికి తరలింపుతక్షణ వైద్య సహాయం అందించినప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో వైద్యుల సూచన మేరకు షాద్మాన్‌ను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఫిజియో బేజెదియుల్ ఇస్లాం వెల్లడించిన వివరాల ప్రకారం అతనికి ఎంఆర్ఐ స్కానింగ్ నిర్వహించారు. రిపోర్టు వచ్చిన తర్వాతే గాయం ఎంత తీవ్రమైనదనే అంశంపై స్పష్టత రానుంది. ప్రస్తుత మ్యాచ్‌లో అతను మళ్లీ బ్యాటింగ్‌కు దిగే అవకాశం లేదని జట్టు మేనేజ్‌మెంట్ స్పష్టం చేసింది.పది మందితోనే పోరాడాల్సిన దుస్థితిక్రికెట్ నిబంధనల ప్రకా ఇది తలకు తగిలిన గాయం కాకపోవడంతో బంగ్లాదేశ్ జట్టుకు ప్రత్యామ్నాయ ఆటగాడిని (సబ్‌స్టిట్యూట్) తీసుకునే అవకాశం లేదు. దీనివల్ల బంగ్లాదేశ్ జట్టు మిగిలిన మ్యాచ్‌లో కేవలం పది మంది ఆటగాళ్లతోనే బరిలో నిలవాల్సి వస్తుంది. ఇప్పటికే సిరీస్‌లో తొలి మ్యాచ్ కోల్పోయి వెనుకంజలో ఉన్న బంగ్లా జట్టుకు ఈ కీలక ఓపెనర్ దూరం కావడం కోలుకోలేని దెబ్బగా మారుతోంది. మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించి మంచి ఫామ్‌లో ఉన్న షాద్మాన్ ఇలా అర్ధాంతరంగా వైదొలగడం జట్టు విజయావకాశాలను దెబ్బతీసింది.వెస్టిండీస్ పటిష్టమైన స్థితిలో ప్రయాణంమరోవైపు మ్యాచ్ విషయానికి వస్తే తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 356 పరుగుల భారీ స్కోరు సాధించింది. కరీబియన్ బ్యాటర్ అమీర్ జంగూ అద్భుతమైన శతకంతో జట్టుకు ఆధికయం అందించాడు. బంగ్లా బౌలర్లలో హసన్ మహీద్ ఆరు వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. అయితే ఇప్పుడు ఓపెనర్ షాద్మాన్ గైర్హాజరీ కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్ బలహీనపడే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట పరిస్థితిని ఆ జట్టు ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది.



కిలో వెండి ధర 10 గ్రాముల బంగారంతో సమానమవుతుందా?



బంగారం, వెండి మార్కెట్లు కొంతకాలంగా నిరంతర అస్థిరతను ఎదుర్కొంటున్నాయి. ఇటీవలి వరకు, వెండి ధరలు వేగంగా పెరుగుతూ పోయాయి. దీంతో పెట్టుబడిదారులు మంచి రాబడులను ఆశించారు. అయితే మార్కెట్ పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ధరలు క్రమంగా పడిపోతున్నాయి. ఒక కిలోగ్రాము వెండి ధరకూ, 10 గ్రాముల బంగారం ధరకూ మధ్య వ్యత్యాసం వేగంగా తగ్గిపోతున్న పరిస్థితి ఏర్పడింది. భవిష్యత్తులో ఒక కిలోగ్రాము వెండి ధర 10 గ్రాముల బంగారం ధర స్థాయికి చేరుకోగలదా?బంగారం, వెండి ధరల మధ్య తేడా ఏమిటి?శుక్రవారం నాడు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో వెండి ఫ్యూచర్స్ కిలోకు రూ.10,500 మేర తగ్గి రూ.178,900కి చేరాయి. 10 గ్రాముల బంగారం ఫ్యూచర్స్ రూ.4,347 మేర తగ్గి రూ.138,419కి చేరాయి. దీనివల్ల సుమారు రూ.40,500 ధరల వ్యత్యాసం ఏర్పడింది. బంగారం ప్రస్తుత ధరకు చేరుకోవాలంటే వెండి ధర సుమారుగా 22.6% తగ్గాల్సి ఉంటుంది. అయితే, బంగారం ధర స్థిరంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది.బంగారు రుణం వర్సెస్ వ్యక్తిగత రుణం.. ఈ రెండింటిలో ఏది మీకు బెస్ట్‌ండి దాని రికార్డు స్థాయి నుండి ఎంత పడిపోయింది?జనవరి 2026లో వీజశలో వెండి ధర కిలోకు రూ.420,048 వద్ద రికార్డు స్థాయికి చేరుకుంది. అయితే, శుక్రవారం నాటి ధర ప్రకారం, ఇది తన గరిష్ట స్థాయి నుండి సుమారు 57% పడిపోయింది. అదే సమయంలో, జనవరిలో 10 గ్రాములకు రూ.180,779 రికార్డు ధరకు చేరుకున్న బంగారం ధర కూడా సుమారు 23% పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధరలు కూడా తీవ్రంగా పడిపోయాయి. శుక్రవారం స్పాట్ వెండి దాదాపు 6% తగ్గి ఔన్సుకు వి49కి చేరగా, బంగారం ఔన్సుకు సుమారు వి3,875 వద్ద ట్రేడవుతోంది.వెండి ధరలు ఎందుకు పడిపోయాయి?వెండి ధరల తగ్గుదలకు అనేక కారణాలు చెబుతున్నారు. అమెరికా స్టాక్ మార్కెట్‌లో టెక్ స్టాక్‌ల అమ్మకాలు, అధిక ముడి చమురు ధరలు, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయనే భయాలు బంగారం, వెండిపై ఒత్తిడిని పెంచాయి. వెండికి ఉన్న డిమాండ్‌లో అధిక భాగం పారిశ్రామిక అవసరాల నుండే వస్తుంది కాబట్టి, అది ఎక్కువగా నష్టపోయింది. అందువల్ల ఆర్థిక వృద్ధి మందగిస్తుందనే భయాలు పెరిగినప్పుడు దాని ధర ఎక్కువగా ప్రభావితమవుతుంది.

ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటున్నారా.. ఈ టైమ్ మిస్ కావొద్దు.



ప్రతి సంవత్సరం దీపావళికి ముందు వచ్చే ధంతేరస్ రోజున బంగారం కొంటే మంచిదని చాలామంది నమ్ముతారు. ఈ ఏడాది నవంబర్ 8వ తేదీన దీపావళి వస్తుండగా.. నవంబర్ 6న శుక్రవారం ధంతేరస్ వస్తుంది. లక్ష్మీదేవి, కుబేరుడికి ఈ పండుగను అంకితం చేశారు. దీంతో నవంబర్ 6న బంగారం కొంటే శుభం జరుగుతుందని, సంపద, ఆరోగ్యం, శ్రేయస్సు కలుగుతుందని బాగా నమ్ముతారు. ముఖ్యంగా స్త్రీలు ఈ రోజున బంగారం కొనుగోలు చేయడానికి ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటారు. ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి ముహూర్తం ఏంటనేది ముందే తెలుసుకుంటారు. ఆ సమయానికి వెళ్లి బంగారం, సిల్వర్ లాంటివి కొనుగోలు చేసే సాంప్రదాయం దేశంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో ధంతేరస్ రోజున బంగారం కొనుగోలు చేయడానికి మంచి సమయం ఏంటనేది తెలుసుకుందాం. హైదరాబాద్‌లో మంచి సమయం ఇదే..ధంతేరస్ రోజున బంగారం, వెండి కొంటే శ్రేయస్సు, సమృద్ధి, అదృష్టం కలుగుతుందనే నమ్మకం చాలామందిలో ఉంటుంది. ఈ రోజున బంగారు ఆభరణాలు, నాణెలు లేదా వెండి పాత్రలు, ఇతర విలువైన లోహాలను కొనుగోలు చేసే సాంప్రదాయం ఇప్పటికీ ఉంది. కొనుగోలు చేసిన వస్తువులను పూజ గదిలో పెట్టి పూజలు నిర్వహిస్తారు. ఈ రోజున బంగారం, వెండి కొనుగోలు చేసేందుకు మంచి సమయం, ముహూర్తం ఏంటనేది ముందే పండితుల ద్వారా తెలుసుకుని తమ కొనుగోళ్లను ప్లాన్ చేసుకుంటారు. అయితే మంచి సమయాలు అనేవి ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి. హైదరాబాద్ విషయానికొస్తే.. నవంబర్ 6న ఉదయం 10.30 గంటల తర్వాత ఎప్పుడైనా బంగారం కొనుగోలు చేసేందుకు మంచి సమయమని పండితులు చెబుతున్నాయి. అయితే సాయంత్రం 6.15 గంటల నుంచి 8.13 గంటల వరకు మధ్య కొనుగోలు చేస్తే మరింత మంచిదని అంటున్నారు. సాయంత్రం షాపుల్లో ఎక్కువ జనం రద్దీ ఉంటుంది గనుక ఉదయం 10.30 గంటల తర్వాత ఎప్పుడైనా కొనుగోలు చేయవచ్చని సూచిస్తున్నారు.ఈ వస్తువులను కూడా కొనుగోలు చేసే సాంప్రదాయం
ఇక ధంతేరస్ రోజున బంగారం, వెండితో పాటు ఇత్తడి, రాగి, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. కొత్తగా కొన్న

కెప్టెన్‌గా తిలక్ వర్మ.. రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు టీమిండియా ఏ టీమ్ ఇదే.. ఆ డేంజర్ ప్లేయర్లకు ఛాన్స్..



ఖతార్ వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక ఏసీసీ మెన్స్ రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ 2026 టోర్నీ కోసం బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన బలమైన ఇండియా-ఎ జట్టును ప్రకటించింది. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో ఈ టోర్నమెంట్ జరగనుంది. యువ సంచలనం తిలక్ వర్మను కెప్టెన్‌గా ఎంపిక చేయగా, అనుభవజ్ఞుడైన బ్యాటర్ రజత్ పాటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఇండియా-ఎ బ్యాటింగ్ లైనప్‌ను బీసీసీఐ అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దింది. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు దేశవాళీ క్రికెట్‌లో తన దూకుడైన ఆటతీరుతో సంచలనం సృష్టిస్తున్న 15 ఏళ్ల చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి జట్టులో చోటు దక్కింది. మిడిలార్డర్‌లో కెప్టెన్ తిలక్ వర్మ, రజత్ పాటిదార్ బాధ్యత తీసుకోనుండగా మ్యాచ్ ఫినిషర్‌గా రింకూ సింగ్ కీలకం కానున్నాడు. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్రా ఎంపికయ్యారు.ఆల్‌రౌండర్స్, బౌలర్స్ వీరే..ఆల్‌రౌండర్ల విభాగంలో సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్ ఉండటంతో జట్టుకు బౌలింగ్, బ్యాటింగ్ ఆప్షన్లు పుష్కలంగా ఉన్నాయి. పేస్ బౌలింగ్ విభాగాన్ని హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్ జట్లు తలపడ నున్నాయి. దోహాలోని వెస్ట్ ఎండ్ పార్క్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా నవంబర్ 20న నేపాల్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో భారత్ తన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. అనంతరం నవంబర్ 22న నడిపించనున్నారు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకున్న భారత సీనియర్ జట్టులో భాగమైన పలువురు ఆటగాళ్లు ఈ ఇండియా-ఎ స్క్వాడ్‌లో ఉండటం విశేషం.గ్రూప్-బిలో భారత్.. నవంబర్ 22న పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ పోరుఈ టోర్నమెంట్‌లో ఇండియా-ఎ జట్టు గ్రూప్-బిలో చోటు దక్కించుకుంది. భారత్‌తో పాటు దాయాది పాకిస్థాన్-ఎ, నేపాల్, యూఏఈ జట్లు ఈ గ్రూప్‌లో ఉన్నాయి. గ్రూప్-ఎలో బంగ్లాదేశ్-ఎ, శ్రీలంక-ఎ, ఆఫ్ఘనిస్థాన్-ఎ, హాంకాంగ్ దాయాది పాకిస్థాన్-ఎతో హైవోల్టేజ్ పోరు జరగనుంది. నవంబర్ 24న యూఏఈతో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడనుంది. రెండు గ్రూపుల నుంచి టాప్-2లో నిలిచిన జట్లు నవంబర్ 26, 27 తేదీల్లో జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 29న గ్రాండ్ ఫైనల్ జరుగుతుంది.
రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌నకు భారత జట్టుతిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పాటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్),

: దీపావళికి ముందురోజే భారీ ఊరట.. బంగారం ధరలు మళ్లీ పతనం..



దీపావళి పండక్కి ముందురోజే పసిడి ధరలు పతనమయ్యాయి. ధంతేరస్ సందర్భంగా నవంబర్ 6వ తేదీన శుక్రవారం గోల్డ్ రేట్లు పడిపోగా.. శనివారం కూడా అదే తగ్గుదల కొనసాగింది. దీపావళికి ముందు రోజే ఇవాళ కూడా గోల్డ్ రేట్లు క్రాష్ అయ్యాయి. పండుగ వేళ ధరలు పడిపోవడం పెద్ద ఊరటగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా పరిణామాల్లో మార్పుల వల్ల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ భారీ ఓటమి తర్వాత అంతర్జాతీయంగా పరిణామాలు మారుతున్నాయి. ఇరాన్‌తో యుద్ధాన్ని ట్రంప్ ముగిసే అవకాశముందని, శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడొచ్చనే వార్తలు బలపడుతున్నాయి. దీంతో ఉద్రిక్తతలు తగ్గితే అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరా మరింత మెరుగుపడనుంది. దీని వల్ల ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ కారణంతో పసిడి ధరల్లో భారీ ఒడిదొడుకులు నమోదవుతున్నాయి. నవంబర్ 7వ తేదీన దేశంలోని వివిధ ప్రాంతాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.
బంగారం ధరలు ఇవాళ ఎలా ఉన్నాయంటే..
-- దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,450 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,31,490గా ట్రేడవుతోంది.
-హైదరాబాద్ బహిరంగ మార్కెట్లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,43,450 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,31,490 వద్ద ట్రేడవుతోంది.
-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,450 పలుకుతుండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,31,490 వద్ద కొనసాగుతోంది.
-దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,43,600కు లభిస్తోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,31,640 వద్ద ట్రేడవుతోంది.-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,450గా ట్రేడవుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,31,490కు లభిస్తోంది.
-బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,43,450 వద్ద ట్రేడవుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,31,490గా కొనసాగుతోంది.
వెండి ధరలు ఇవే..-ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,04,900 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ రేటు రూ.2,05,000 వద్ద స్థిరపడింది
-హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ ధర రూ.2,04,900 వద్ద ట్రేడవుతోంది
-చెన్నైలో కేజీ వెండి ధర రూ..2,04,900 పలుకుతోంది.

ప్రజా అక్షర న్యూస్
TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

రెమ్యునరేషన్ తక్కువైందని సీత పాత్రను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్.



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన 'రామాయణం' ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. రూ. 4,000 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా గురువారం (నవంబర్ 05) ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే ఈ సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ వచ్చింది. నటీనటుల యాక్టింగ్, నితేష్ తివారీ టేకింగ్ అన్నిటికీ మించి హాలీవుడ్ సినిమాలను తలదన్నేలా విజువల్ ఎఫెక్ట్స్ వెరసి.. నేటి ఆడియెన్స్ కు ఆధునిక హంగులతో రామాయణాన్ని అద్భుతగా చూపించారు. నమిత్ మల్హోత్రాకు చెందిన 'ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్', యష్‌కు చెందిన 'మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్', 'డీఎన్ఈజీ' సంస్థలు భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మించాయి. రణ్ బీర్, సాయి పల్లవి, యశ్ ల తో పాటు సన్నీ డియోల్, శోభన, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, హరీశ్ ఉత్తమన్, ఫైసల్ మాలిక్, వివేక్ ఒబెరాయ్, కునాల్ కపూర్, ముకేశ్ తివారి, అనుపమ్ ఖేర్, సౌరబ్ సచ్‌దేవ్, రవి దూబే, ఆదినాథ్ కొఠారే, నితీశ్ శర్మ.. ఇలా ఎంతో మంది స్టార్స్ ఈ సినిమాలో నటించారు. కాగా ఈ సినిమాలో రణ్ బీర్ కపూర్ రాముడిగా ఒదిగిపోయారు. అలాగే సీతమ్మ పాత్రలో సాయి పల్లవి అభినయం నెక్ట్స్ లెవెల్ అని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే ఈ రామాయణ సినిమాలో సాయి పల్లవి కంటే ముందు సీత పాత్ర కోసం పలువురు హీరోయిన్లు సంప్రదించారని వార్తలు వచ్చాయి. అయితే వివిధ కారణాలతో వారు ఈ పాత్రను తిరస్కరించారని రూమర్లు వినిపించాయి. అందులో బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్ కూడా ఉంది. తాజాగా ఇదే విషయంపై ఆమె పూర్తి క్లారిటీ ఇచ్చింది.కాగా సాయి పల్లవి కంటే ముందే కరీనా కపూర్‌కు సీత పాత్రను ఆఫర్ చేశారని, అయితే ఆమె ఎక్కువ పారితోషికం అడిగారని, అందుకే ఆమెను తీసుకోలేదని అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలు పూర్తిగా అబద్ధమని నటి కరీనా స్వయంగా ఖండించింది. సీత పాత్ర కోసం తనకు ఎటువంటి ఆఫర్ రాలేదని కరీనా స్పష్టం చేసింది. అసలు ఈ సినిమా కోసం తనతో ఎలాంటి చర్చలు జరగలేదని కూడా ఆమె పేర్కొంది. తద్వారా రెట్టింపు పారితోషికం డిమాండ్ చేసినందుకే కరీనా కపూర్‌ను సినిమా నుంచి తొలగించారన్న వదంతులలో ఏమాత్రం నిజం లేదని స్పష్టమైంది.కాగా కేజీఎఫ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి కూడా సీత పాత్ర కోసం ఆడిషన్స్ ఇచ్చింది. అయితే దర్శక నిర్మాతలు ఆమెను సెలెక్ట్ చేయలేదు. ఈ విషయాన్ని శ్రీనిధి శెట్టినే స్వయంగా చెప్పుకొచ్చింది. రామాయణం సినిమా రిలీజ్ మరోసారి ఈ వార్తలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

వామ్మో.. ఈ టాలీవుడ్ హీరోయిన్ మాములిది కాదు



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి అతుల్య చంద్ర. మలయాళం, తెలుగులో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా ఈ హీరోయిన్ ఒక సంచలన కేసులో చిక్కుకోవడం సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. కొచ్చికి చెందిన ఒక వైద్యుడిని బెదిరించి, దోపిడీకి పాల్పడిందట. ఆమె పై వచ్చిన ఈ తీవ్ర ఆరోపణల నేపథ్యంలో కేరళ పోలీసులు ఆమెను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ వార్త ప్రస్తుతం టాలీవుడ్ , మలయాళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సమాచారం ప్రకారం.. కొచ్చిలోని ఒక ప్రముఖ వైద్యుడిని లక్ష్యంగా చేసుకుని ఈ రాబరీ జరిగినట్లు తెలుస్తోంది.కేరళలోని కొచ్చిలో అతుల్య చంద్ర.. నటుడు, నిర్మాత బిబిన్ పెరుంబిల్లితో కలిసి సోమవారం తన అపార్ట్ మెంట్ నుంచి స్థానిక వైద్యుడికి ఫోన్ చేసింది. తన బంధువుకు అత్యవసర వైద్యసాయం అందించేందుకు ఇంటికి రావాలని ఆయనను పిలిచింది. ఉదయం ఆరున్నరకు డాక్టర్ వాళ్ల ఫ్లాట్ కు వెళ్లేసరికి అక్కడ దాదాపు 12 మంది యువతి యువకులు ఉన్నారు. అందరూ కలిసి సదరు డాక్టర్ పై దాడి చేసి అతడి దగ్గరున్న నగదు, ఫోన్, వాచ్, వైర్ లెస్ ఇయర్ ఫోన్స్ లాక్కున్నారు. ఇదంతా పోలీసులకు చెబితే వైద్యం కోసం వచ్చి మ బంధువుపై అత్యాచారానికి ప్రయత్నించావని కేసు పెడతామి బెదిరించారు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధిత డాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన కొచ్చి పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, ఆధారాల ఆధారంగా అతుల్య చంద్రతో పాటు ఆమెతో ఉన్న అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి నుంచి భారీ మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులను బెదిరించి గుంజినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.శ్రీసింహా కోడూరి కథానాయకుడిగా పరిచయమైన క్రైమ్ హాస్య చిత్రం 'మత్తు వదలరా' లో అతుల్య చంద్ర ఒక కీలకమైన పాత్రలో కనిపించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సినిమాలో తన్న మలయాళ ప్రాజెక్టులలోనూ నటించారు. సినీ కెరీర్ ఆశాజనకంగా సాగుతున్న సమయంలోనే ఆమె ఇలాంటి నేరపూరిత ఉదంతంలో అరెస్ట్ కావడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, దోపిడీ వెనుక ఉన్న అసలు కారణాలు ,ఇతర వ్యక్తుల ప్రమేయంపై విచారిస్తున్నామని కేరళ పోలీసులు స్పష్టం చేశారు.

సీన్ మూవీ రివ్యూ.. అదరగొట్టిన సూర్య.. మైండ్ గేమ్..!



వరుస విజయాలతో జోరు మీదున్న సూర్య.. సీన్ అంటూ ఒకే ఏడాది మూడో సినిమాతో వచ్చేసారు.. మలయాళ దర్శకుడు జీతూ మాధవన్ తెరకెక్కించిన ఈ చిత్రం ఎలా ఉందో పూర్తి రివ్యూలో చూద్దాం..ప్రేమ్ రాజ్ (సూర్య) నేరాలను ఇట్టే పసిగట్టే షెర్లాక్ హోమ్స్ లాంటి తెలివైన పోలీస్ ఆఫీసర్. కానీ అతనికి ఒక పెద్ద బలహీనత ఉంటుంది. అది ఎవరికీ తెలియకుండా ఉండటానికి తను చేస్తున్న పోలీస్ జాబ్‌కు రిజైన్ లెటర్ పంపిస్తాడు ప్రేమ్ రాజ్. కానీ దాన్ని ఒప్పుకోడు ఆయన సుపీరియర్ (లాల్). మరోవైపు ఈశ్వరన్ (నస్లెన్) చాలా తెలివైన సీరియల్ కిల్లర్, అలాగే డబ్బు కోసం హత్యలు చేసే కాంట్రాక్ట్ కిల్లర్. తనకున్న లోపాన్ని పక్కనపెట్టి, అంతటి ప్రమాదకరమైన హంతకుడిని ఈ పోలీస్ ఆఫీసర్ ఎలా పట్టుకున్నాడు.. దానికోసం మాయ (నజ్రియా నజీమ్) ప్రేమ్ రాజ్‌కు ఎలా సాయం చేసింది.. ఈ ఇద్దరి మధ్య ఉన్న రిలేషన్ ఏంటి..? అసలు ప్రేమ్ రాజ్‌కు ఉన్న లోపమేంటి అనేది ఈ చిత్ర ప్రధానాంశం'రోమాంచం', 'అవేశం' లాంటి సినిమాలతో హారర్, గ్యాంగ్‌స్టర్ జానర్లకు కొత్త మలుపులు ఇచ్చిన దర్శకుడు జీతూ మాధవన్.. ఇప్పుడు ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ను ఎంచుకుని అందులో కూడా అద్భుతమైన వినోదాన్ని పండించాడు. సీరియల్ కిల్లర్ కాన్సెప్ట్ అనగానే 'రాక్షసన్' లాంటి భయపెట్టే హింసాత్మక దృశ్యాలు ఉంటాయని ఊహిస్తాం. కానీ ఇక్కడ అందుకు పూర్తి భిన్నంగా కామెడీ, మాస్ ఎలిమెంట్స్ జోడించి చాలా కూల్ గా కథను నడిపించాడు. హీరో తన ఇన్వెస్టిగేషన్ కోసం ఎంచుకున్న టీమ్ అంతా ఏదో ఒక లోపం ఉన్నవారే కావడం విశేషం. హీరోయిన్ నజ్రియా ఫహద్‌కు ఒక మైనస్ ఉన్నప్పటికీ, ఆమె హీరోకి కళ్ళులాగా సహాయపడుతుంది. హీరో తల్లిదండ్రులు కూడా వైకల్యంతో బాధపడుతుంటారు. ఈ విభిన్నమైన పాత్రలతోనే దర్యాప్తు సరదాగా సాగుతుంది. దర్శకుడు భారీ సెట్టింగులకు వెళ్లకుండా, కథలో ఎక్కువ భాగాన్ని హీరో ఇంట్లోనే నడిపించాడు. ఈశ్వరన్ నేరాలు చేసే తీరు కూడా చాలా సాధారణంగా ఉన్నప్పటికీ, అది స్క్రీన్ మీద చాలా ఎఫెక్టివ్ గా వర్కౌట్ అయింది. అయితే సినిమా మొదలైన కాసేపు కథ కాస్త నెమ్మదిగా సాగుతుంది, లాల్ కామెడీ సీన్స్ బాగా పండాయి. కానీ ఎప్పుడైతే హీరో బలహీనత రివీల్ అవుతుందో, అక్కడి నుంచి స్క్రీన్ ప్లే ఊపందుకుంటుంది. ఆ తర్వాత కిల్లర్ కు, పోలీసులకు మధ్య జరిగే క్యాట్ అండ్ మౌస్ గేమ్ ప్రేక్షకులను కుర్చీ అంచున కూర్చోబెడుతుంది. అనవసరమైన హంగామా లేకుండానే, హీరో హీరోయిన్ల ఇద్దరికీ విజిల్స్ వేసే రేంజ్ మాస్ ఎలివేషన్స్ ఇవ్వడం కథనంలో మరో ప్లస్ పాయింట్.నటీనటులు:సూర్య ఈ సినిమాలో చాలా రిలాక్స్‌గా కనిపించి తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. ఆయన పాత హిట్ సినిమాలు కాక కాక, సింగం, సెవెంత్ సెన్స్, సూర్య సన్నాఫ్ కృష్ణన్ రిఫరెన్సులు అభిమానులను అలరిస్తాయి. కానీ అవి ఎక్కడా అతిగా అనిపించవు. సీరియల్ కిల్లర్ గా నస్లెన్ నటన చాలా కూల్ గా, నేచురల్ గా ఉంది. ఈ కుర్రాడు పూర్తిగా సర్‌ప్రైజింగ్ ప్యాకేజ్. నజ్రియా ఫహద్ తన పాత్రకు పూర్తి న్యాయం చేసింది, ఆమెకు కూడా ఒక అదిరిపోయే మాస్ సీన్ దక్కింది. హీరో తండ్రి పాత్రలో పెదరాయుడు ఫేమ్ ఆనందరాజ్‌తో పాటు మిగతా వారు తమ పరిధి మేర బాగానే నటించారు.టెక్నికల్ టీంసుషిన్ శ్యామ్‌కు ఇది తొలి తమిళ చిత్రం. సీరియల్ కిల్లర్ సినిమాల్లో ఉండే రెగ్యులర్ లౌడ్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ లా కాకుండా, చాలా ప్రశాంతమైన సంగీతాన్ని అందించాడు. అజ్మల్ సబు ఎడిటింగ్

దిల్ మూవీతో వచ్చిన ప్రాఫిట్ అంతా తరుణ్ సినిమాతో పోయింది



ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన సినీ ప్రస్థానంలోని ఒడిదుడుకులను, ముఖ్యంగా తన మొదటి బ్లాక్‌బస్టర్ దిల్ సినిమా విజయం, ఆ లాభాన్ని హీరో తరుణ్ నటించిన నిన్నే ఇష్టపడ్డాను చిత్రం ఎలా హరించివేసిందో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. తొలినాళ్లలో దిల్ రాజు డిస్ట్రిబ్యూటర్‌గా మూడు వరుస ప్లాపులు చవిచూశారు. దీనివల్ల పరిశ్రమలో చేయి మంచిది కాదు అనే సెంటిమెంట్‌తో ఆయనను ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఈ దశలో ఆయన దిల్ సినిమా నిజాం హక్కులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించారు. ఆరు లక్షల రూపాయలు చెల్లించి, మొత్తం 60 లక్షల రూపాయల డీల్‌ను పూర్తి చేయడానికి చాలా మంది ఆఫీసుల చుట్టూ తిరిగారు. అయితే ఆయన గత రికార్డు, సినిమా కాన్సెప్ట్‌పరంగా ఎవరూ పెట్టుబడి పెట్టడానికి ముందుకు రాలేదు. ఇలాంటి సమయంలో, సినీ దిగ్గజం ఎం.ఎస్. రెడ్డి (తలంబాలు, ఆఫుతి, అంకుశం వంటి చిత్రాల నిర్మాత) ఒక మీడియేటర్ ద్వారా దిల్ రాజును సంప్రదించారు. ఎం.ఎస్. రెడ్డి భాగస్వామ్యం అడగడం దిల్ రాజుకు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగించింది. హైదరాబాద్‌లో జరిగిన చర్చల అనంతరం, ఎం.ఎస్. రెడ్డి దిల్ సినిమాలో 50% వాటా తీసుకునేందుకు అంగీకరించారు. దిల్ రాజు చెల్లించిన ఆరు లక్షల రూపాయలకు అదనంగా, ఎం.ఎస్. రెడ్డి మరో ఆరు లక్షలు చెల్లించి, వారి భాగస్వామ్యాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత దిల్ రాజుతో కలిసి చెన్నై వెళ్లి, సుబ్రమణ్యేశ్వర ఫిలిమ్స్ పేరు మీద అగ్రిమెంట్‌ను పూర్తి చేయించారు.దిల్ చిత్రం

వాళ్లు నాశనం అవ్వాలనే కోరుకుంటా..



జబర్దస్త్ కామెడీ షో ద్వారా బుల్లితెరపై విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నాడు చలాకీ చంటి. ఆ తర్వాత సినిమాల్లో హాస్య నటుడిగా కనిపించిన చంటి.. ఇప్పుడు అంతగా మూవీస్ చేయడం లేదు. ఇదిలా ఉంటే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో నటుడు చలాకీ చంటి మాట్లాడుతూ తన జీవితంలోని బాధలు, మోసాలు, సినీ పరిశ్రమలో ఎదురైన అనుభవాలపై తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. "నా ఎదుగుదలను అడ్డుకున్నవారు, నాకు జరగాల్సిన సమయాల్లో అవకాశాలు ఆగిపోవడానికి ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ కారణమైన ప్రతి ఒక్కడూ సర్వనాశనం అయిపోవాలి" అని ఆగ్రహంగా, శాపనార్థం చేస్తూ మాట్లాడారు. తన కడుపుమండితోనే ఈ మాటలు చెబుతున్నానని, ఎదుటివారికి చెడు కోరుకోవద్దు అని చెప్పడం తప్పు అని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. తన చెడును కోరుకున్నప్పుడు తాను ఎందుకు వారి చెడును కోరుకోకూడదని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం మానవ సహజ స్వభావమని, "నేను బాగుంటేనే నువ్వు బాగుండాలని కోరుకుంటా, నేను నాశనం అవ్వడానికి కారణమైనవాడు నాశనం అవ్వాలి" అని ఆయన స్పష్టం చేశారు.తన సినీ ప్రయాణంలో ఎదురైన కష్టాలు, ముఖ్యంగా ఇండస్ట్రీలో తనకు "ఈగో" ఉందనే అపవాదుపై చంటి వివరణ ఇచ్చారు. ఒక ఆర్టిస్టుగా ప్రతిసారీ వంగి వంగి రావడం సాధ్యం కాదని, అది కొందరికి నచ్చకపోవచ్చని అన్నారు. కో-డైరెక్టర్లు లేదా ఇతర టీమ్ సభ్యులు తమకు నచ్చకపోతే అవకాశాలను ఎలా అడ్డుకుంటారో తెలిపారు. "నెంబర్ రాసుకున్నాను భయ్యా, తొందరగా ఫోన్ వస్తుంది" అని చెప్పి, ఆ అవకాశాన్ని వేరొకరికి ఎలా కట్టబెడతారో ఆయన ఉదాహరణలతో చెప్పారు. కో-డైరెక్టర్ లేదా టీమ్ సభ్యులకు తనను నచ్చకపోతే, లేదా వారికీ వేరొకరితో వంద రకాల లావాదేవీలు ఉంటే తన స్థానంలో వేరొకరిని తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్త డైరెక్టర్లతో పని చేసేటప్పుడు ఎదురయ్యే సమస్యలను చలాకీ చంటి ప్రస్తావించారు. తనకు ఏజ్ తక్కువ ఉన్నా, తన తర్వాత ఇండస్ట్రీలోకి వచ్చి హిట్ కొట్టి డైరెక్టర్లు అయినవారు కొంతమంది అన్న అని పిలుస్తారని, మరికొందరు "అన్న వద్దన్నా, పేరుతో పిలవండి" అని అంటారని చెప్పారు. అలా పేరుతో పిలిచినప్పుడు, పక్కన ఉన్న టీమ్ సభ్యులకు అది నచ్చక, తన పాత్రను తీసేసిన సంఘటనను వివరించారు. "ఒక దర్శకుడి తండ్రి పక్కన నుంచుని సిగరెట్ తాగినందుకు నా పాత్రను తీసేశారు. ఆయన డైరెక్టర్ తండ్రి అని నాకు తెలిస్తే నేను అక్కడ ఉండను కదా" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు తనకే కాకుండా చాలా మంది ఆర్టిస్టులకు ఎదురవుతాయని ఆయన అన్నారు.

ప్రతి రోజూ బెండకాయ కూర ఉండాల్సిందే



అక్కినేని నాగార్జున ఎప్పుడూ యంగ్‌గా, ఫిట్‌గా కనిపించడానికి గల కారణాలను ఆయన వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. నాగార్జున కేవలం తన రిచ్‌నెస్‌తో కాకుండా, తన క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శరీర నిర్వహణతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని చంద్ర తెలిపారు. నాగార్జున వారంలో ఐదు రోజులు సాధారణ ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. ఉదాహరణకు, అల్పాహారంగా ఒక ఇడ్లీ లేదా ఒక వడ, ఒక గారె మాత్రమే తింటారు. ఆయనకు ఆకలి వేస్తేనే తింటారని, ఆకలి లేనిది ఎప్పుడూ ఆహారం తీసుకోరని చంద్ర స్పష్టం చేశారు. చాలామందిలాగా ఆకలి ఉన్నా లేకపోయినా ఎవరో పెడితే తినే అలవాటు ఆయనకు లేదని పేర్కొన్నారు. ప్రతిరోజూ బెండకాయ కూర ఉండాలి. హాట్ చిప్స్, రసం, ఒక అరటిపండు కూడా తప్పనిసరి. అన్నం విషయానికి వస్తే, ఆయన మన సాధారణ బియ్యంతో వండిన అన్నం తినరని అన్నారు. పాత రోజుల్లో ఉండే తవుడు తీయని దంపుడు బియ్యం అన్నాన్ని మాత్రమే తింటారు. ఈ అన్నం చాలా మెత్తగా, ముద్దలాగా ఉండాలని ఆయనకు ఇష్టమని చంద్ర వివరించారు. ఈ నాలుగు రకాలు కంపల్సరీగా ఉంటాయి, కానీ అన్నీ తక్కువ